

Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

Longest Living Newspaper in Telugu Journalism

జమీందారు

సంపుటి: 82 • సంచిక: 40 • 7-10-2011 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-


a ••• hotel with 5 star comforts

D.R. UTTHAMA HOTEL

Winner of Excellence Award 2004, 2005 & 2006

G.T.Road, Nellore - 524 003.(A.P)

Ph: 0861 - 2317777


email - drutthama@yahoo.co.in

దొడ్డిదారిలో తెలంగాణలో ప్రవేశిస్తాడట 'జగన్'

సిబిఐ కేసులను లెక్క చేయకుండా జనం తనంటే పడి చస్తున్నారని కృష్ణాజిల్లా ఓదార్పు యాత్రతో రుజువు కావడంతో జగన్‌కు ఏనుగెక్కినంత సంబరంగా వుంది. ఇదే మోజు కొనసాగితే రేపు జైలుకు వెళ్లినా నష్టమేదీ రాదనే ధైర్యం వచ్చిందాయనకు. సందట్లో సడేమియా అన్నట్లు, తెలంగాణ ప్రాంతంలో కూడా తన వునికి చాటుకోవడానికి ఇదే అదునుగా భావిస్తున్నాడు. రేపు 16తేది ప్రారంభం కానున్న గుంటూరు జిల్లా ఓదార్పు యాత్రను ఇందుకొక అవకాశంగా వాడుకోవాలని వ్యూహం రచించాడు. గుంటూరు జిల్లా, తెలంగాణకు చెందిన నల్గొండ జిల్లాకు సరిహద్దులో వుంది. నాగార్జునసాగర్ వంతెనకు అటు వైపు గుంటూరు, ఇటు వైపు నల్గొండ. అది పల్నాడు ప్రాంతం. రెడ్డి కులం ప్రాబల్యం ఎక్కువ. తెలంగాణపై ఒక స్పష్టమైన అభిప్రాయం ప్రకటించకుండా తమ ప్రాంతంలోకి అడుగు పెట్టనివ్వబోమని ఉద్యమకారులు మొండి పట్టు పడుతున్నారు. కానీ రాష్ట్ర విభజన జగన్‌కు ఇష్టం లేని పని. హైద

కొరవ 14వ పేజీలో

కార్టూన్ స్పేస్



మీరు మాట్లాడుతున్న మైకు జనరేటర్‌తో నడుస్తోంది సార్!

తెలంగాణ ఇవ్వాలా ... వద్దా?

సంకటంలో సోనియా!

తెలంగాణ ఇవ్వాలా వద్దా అనే విషయంలో ఒక అభిప్రాయానికి రావడం కాంగ్రెస్ పెద్దల తరం కావడం లేదు. దేశంలో కాంగ్రెస్ పార్టీ స్వతంత్రంగా అధికారంలో వుండే ఏకైక పెద్ద రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. తెలంగాణ ఉద్యమం వల్ల అక్కడ పార్టీ పతనమై పోవడం వారికి ఇష్టం లేదు. కానీ దీనికి సమచిత పరిష్కారం ఏది అన్నదే తోచడం లేదు. ప్రధాని మన్మోహన్‌సింగ్ సిద్ధాంతపరంగా చిన్న రాష్ట్రాల ఏర్పాటును వ్యతిరేకిస్తున్నాడు. రాష్ట్రాలు చిన్నవైపోతే నక్సలైట్ల సమస్య అదుపు తప్పి పోతుందని, రాజకీయ అనిశ్చితి కారణంగా ఆర్థిక అభివృద్ధి మందగిస్తుందని ఆయన నమ్మకం. రాహుల్‌గాంధీ ఆలోచన ఇందుకు విరుద్ధం. దేశంలో పేదరికం తొలగాలంటే పరిపాలనా పరంగా చిన్న రాష్ట్రాలే వుండాలని దాని వల్ల ప్రజలు పరిపాలనకు దగ్గరౌతారని రాహుల్ వాదిస్తున్నాడు. తెలంగాణతో పాటు బుందేల్ ఖండ్, కియోన్జహార్ వంటి రాష్ట్రాలను ఏర్పాటు చేయాలన్నది ఆయన అభిమతం. ప్రణబ్ ముఖర్జీ భావనలు ప్రధానికి దగ్గరగా వున్నాయి. తెలంగాణ ఏర్పాటుకు ఆయన సుముఖం కాదని చెప్తారు. గులాం నబీ అజాద్ కూడా అదే అభిప్రాయంలో వున్నాడట. హోంమంత్రిగా ఈ సమయంలో చొరవ చూపాల్సిన చిదంబరం సంకటంలో పడిపోయాడు. తెలంగాణ ఇవ్వాలని చెప్తే, తమిళనాడు ప్రయోజనాల కోసం ఆంధ్ర ప్రదేశ్‌ను ముక్కలు చేయాలని చూస్తున్నాడనే నింద పైన పడుతుంది. సమైక్యం అందామా అంటే, తెలంగాణ ఉద్యమానికి పరిష్కారం ఆయన వద్ద లేదు. అహ్మద్ పటేల్ వంటి వారు జగన్ ప్రాభవాన్ని తగ్గించాలంటే, తెలంగాణ ఇవ్వాలని వాదిస్తున్నారు. వీరందరి వాదనలతో సోనియాగాంధీ చికాకు పడుతున్నారు. ఎవరి మాట వినాలో ఆమెకు అర్థం కావడం లేదు. తన పార్టీలోనే ఇన్ని భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడం ఆమెను ఆందోళనకు గురి చేస్తున్నాయి.

అందువల్లనే ప్రణబ్ ముఖర్జీ తెలంగాణ మీద తన అభిప్రాయాలను అంత ముక్కుసూటిగా వెల్లడించాడు. 500 ఏళ్ల దేశ చరిత్రను ఉద్యమంతో ముడి పెట్టాడు. ఈ చిక్కుముడి విప్పడం తమ తరం కాదని తేల్చి పారేశాడు. రెండవ ఎస్సార్సీ వంటి ప్రయోగం ద్వారా కొంతకాలం సమస్యను వాయిదా వేయడం ఒక్కటే మార్గమన్నది ఆయన అభిప్రాయం. అయితే అది అంత సులభం కాదు. తెలంగాణ ఉద్యమం ఇప్పుడు రాజకీయ పార్టీల చేతులలో లేదు. అది ప్రజల మనసులలోకి ప్రవేశించింది. అన్ని వర్గాలు, కులాలు, మతాలు, వయస్సుల వారు అందులో నిమగ్నమై పోయారు. ఆఖరుకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కూడా తెలంగాణ కోరు కొంటున్నారు. ఇంత విస్తృతమైన ఉధృతమైన ప్రజా ఆకాంక్షను దెబ్బ తీస్తే పరిణామాలు తీవ్రంగా వుంటాయి. మూడున్నర కోట్ల మంది ప్రజల మనసులను గాయపర్చడం దేశానికి హితం కాదు. కానీ ఈ

కొరవ 14వ పేజీలో



[అమెరికాలో సూర్యోదయం]

అమెరికన్ సామ్రాజ్యపు ఆయువుపట్టు పెట్టుబడిదారీ వ్యవస్థ. కాపిటలిజం పునాదుల పైన అత్యద్భుతమైన ఆర్థిక శక్తిని నిర్మించారు ఆ దేశ నేతలు. అంతర్జాతీయంగా పెద్దన్న స్థాయి సంతరించి పెట్టారు. ప్రపంచ ప్రజలందరికీ అమెరికా అంటే అసూయ. అదొక ఇంద్రలోకమని, అక్కడకు వెళ్తే స్వర్గం చేతికి అందివస్తుందని ఆశ. తమ పిల్లలు అమెరికాలో ఉద్యోగాలు చేయాలని కలలు కనే తల్లిదండ్రులు కోకొల్లలు. ఇంజనీర్లు, డాక్టర్లు, శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, ఇతర వృత్తిపరమైన నిపుణులు అమెరికాను తమ గమ్యంగా, లక్ష్యంగా భావిస్తూ వుంటారు. ఆ దేశంలో స్థిరపడడం జీవితాశయంగా ప్రణాళికలు వేస్తుంటారు. అక్కడి జీవన ప్రమాణాల గురించి, రాబడి గురించి, ఖర్చు గురించి, సుఖాల గురించి, సౌకర్యాల గురించి కథలు కథలుగా చెప్పుకొనే అలవాటు ప్రపంచ దేశాలన్నిటిలో వుంది. అమెరికాను చూస్తే చైనా, భారత్‌తో సహా అన్ని దేశాలకూ అదొకరకమైన భయం. వారి ఆయుధ శక్తి, ఆర్థిక సంపదల ముందు ఎంతటివాడైనా తలదించక తప్పదన్న భావన వుంది. సోవియట్ రష్యా పతనం తర్వాత అంతర్జాతీయ రాజకీయాలలో అమెరికాకు ఎదురన్నది లేకుండా పోయింది. వారు చెప్పిందే వేదం, చేసిందే శాసనం.

అనుసరించే ఆర్థిక విధానాల వల్లనే ఆ దేశం అంత ఉన్నతస్థాయి అగ్రరాజ్యంగా ఎదిగిందని కరడు కట్టిన కమ్యూనిస్టులు కూడా అంగీకరించక తప్పదు. అమెరికన్ అగ్రశ్రేణి వ్యాపార సంస్థల భారీతనాన్ని మాటలలో వర్ణించలేము. వాటి వార్షిక రాబడి, చాలా వర్ధమాన దేశాల బడ్జెట్ కంటే ఎన్నో రెట్లు అధికంగా వుంటుంది. మైక్రోసాఫ్ట్, జిఇ, ఐబిఎం, యాపిల్, ఫోర్డ్, లాఖీడ్, వాల్‌మార్ట్, ఎక్సాన్ మొబైల్, చెవరాన్, బ్యాంక్ ఆఫ్ అమెరికా, జనరల్ మోటార్స్ వంటి కంపెనీల ఎదుగుదల వల్లనే అమెరికా ఒక ఆర్థిక శక్తిగా రూపాంతరం చెందిందన్నది నిజం. ఒక్క వాల్‌మార్ట్ స్టోర్స్ కంపెనీ వార్షిక రాబడి దాదాపు 22లక్షల కోట్ల రూపాయలు. భారతదేశం బడ్జెట్ ఇందులో సగాన్ని మించదంటే, అమెరికన్ కంపెనీల ఆర్థిక స్థాయి ఎంతటిదో అంచనా వేసుకోవచ్చు.

ఈ ఘనతకంతటికీ కారణం అమెరికా అనుసరించిన పెట్టుబడిదారీ ఆర్థిక విధానాలు. అదే సమయంలో కమ్యూనిస్టు సిద్ధాంతాలతో పోటీపడిన సోవియట్ రష్యా ఎట్లా పతనమై పోయిందీ కళ్లారా చూశాము మనం. అప్పటి, ప్రపంచ ఆర్థిక పురోగతికి కాపిటలిజం ఒక్కటే శరణ్యమన్న అభిప్రాయం అందరిలో బలపడిపోతున్నది. ఆ మాయతోనే మన్మోహన్ సింగ్ గత ఇరవై ఏళ్లుగా ఆర్థిక సంస్కరణలు అమలు చేస్తున్నాడు మన దేశంలో. కానీ విచిత్రంగా అదే అమెరికన్ అదే కాపిటలిజం ఆర్థిక విధానాలను నిరసిస్తూ వీధి పోరాటాలు జరుపుతున్నారు. అమెరికన్ ఆర్థిక శక్తికి సంకేతమైన వాల్ స్ట్రీట్‌కు సంకేతంగా తమ ఆందోళనకు "ఆక్యుపై వాల్‌స్ట్రీట్" అని నామకరణం చేశారు. గత వారంలో న్యూయార్క్ నగరంలోని వాల్‌స్ట్రీట్‌లో చిన్నపాటి ప్రదర్శనగా మొదలైన ఈ ఆందోళన, రోజుల వ్యవధిలోనే దేశమంతా విస్తరించింది. వాషింగ్టన్, బోస్టన్, చికాగో, లాస్‌ఏంజెల్స్‌లతో సహా 148 నగరాలలో లక్షలాది మంది అమెరికన్ యువతీ యువకులు వీధులలోకి వచ్చారు. అమెరికన్ కంపెనీల దురాశ, వాటితో కుమ్మక్కైన ఆర్థిక విధానాలు రూపొందిస్తున్న ప్రభుత్వ కుతంత్రం నశించాలని నినాదాలు చేస్తున్నారు. వ్యాపార విస్తరణ పేరిట అమెరికన్ కంపెనీలు తమ జేబులు కొల్లగొడుతున్నాయని, తమ ఉద్యోగాలను హరించివేస్తున్నాయని ఎలుగెత్తి చాటుతున్నారు. ఈ ఉద్యమ వేడి అమెరికన్ ప్రభుత్వానికి వణుకు పుట్టిస్తున్నది. అరెస్టులు, లాఠీ ఛార్జీలతో దాన్ని అణచాలని పోలీసులను వుసిగొల్పుతున్నారు. దానితో ఉద్యమం మరింత ఉధృతమౌతున్నది. పలు కార్మిక సంఘాలు వారికి సంఘీభావం ప్రకటిస్తున్నాయి.

జమీన్‌రైతు

అమెరికన్ పౌరుల జీవితాలను ప్రపంచం యావత్తు అసూయపడుతున్న సమయంలో అదే పౌరులు తమ జీవితాలు నాశనమౌతున్నాయని ఆందోళనకు దిగడం, ఏ ఆర్థిక విధానాలు ప్రపంచ ఆర్థిక పురోగతికి శిరోధార్యమని మనం నమ్ముతున్నామో అదే ఆర్థిక విధానాలు తమకొద్దని ఆ పౌరులు వీధి పోరాటాలకు దిగడం విచిత్రమైన పరిణామం. అమెరికన్ ఆర్థిక శక్తి వెలుగుల వెనుక దాగిన చీకటిని, పెట్టుబడిదారీ వ్యవస్థ పైమెరుగుల లోపల దాగిన కుళ్లు కంపును "ఆక్యుపై వాల్‌స్ట్రీట్" ఉద్యమం నగ్నంగా బయటపెడుతున్నది. ఒకరకంగా చెప్పాలంటే అమెరికాలో ప్రజా చైతన్యమనే సూర్యోదయం వెలుగు చూస్తున్నది. అమెరికన్ మాయలో మునిగివుండే మన్మోహన్ సింగ్ వంటి ఆర్థికవేత్తలకు ఈ ఉద్యమంతోనైనా కనువిప్పు కలిగితే ప్రపంచం సరైన దారిలో నడవడానికి దారులు ఏర్పడతాయి.

జనవాక్కు

కిరణ్‌కుమార్‌రెడ్డి వైఫల్యం!

ముఖ్యమంత్రిగా కిరణ్‌కుమార్‌రెడ్డి వైఫల్యం చెందారని చెప్పొచ్చు. ఆయనకు ప్రజల్లో మద్దతుదారులు లేరు. మంత్రివర్గంలోనూ ఏకాకిగానే మిగిలిపోయారు. రాజీనామా చేసిన తెలంగాణ మంత్రులను తిరిగి విధులకు హాజరయ్యేలా ఒప్పించలేకపోయారు. వ్యాట్ పెంపుదలతో నిత్యావసర వస్తువుల ధరలు బాగా పెరిగిపోయాయి. విద్యుత్ ఛార్జీల పెంపుకు దొడ్డిదారి ప్రయత్నం చేస్తున్నారు. ఆయన జనం కోసం ప్రకటించిన రూపాయికి కిలో బియ్యం పథకం వల్ల ప్రయోజనం శూన్యం. ఆయనకు పాలనపై పట్టులేదు. ఎవరి సలహాలు తీసుకోరు. దీనిమూలంగా వాస్తవ పరిస్థితులు బేరీజు వేయలేక వైఫల్యం చెందిన ముఖ్యమంత్రిగా చరిత్రలో మిగిలిపోయాడు.

పి.అరుణకుమారి నెల్లూరు

రగడపాటి

తెలంగాణ సమస్య చాలా భావోద్రేకాలు రేకెత్తించే అంశం. ఈ వ్యవహారంలో సంయమనమే ఉత్తమం. కానీ సకల జనుల సమ్మెలో భాగంగా తెలంగాణ వాదుల దాడిలో గాయపడిన ఆర్డీఏ అసిస్టెంట్ కమిషనర్ పరామర్శకు వెళ్లిన విజయవాడ ఎమ్పీ లగడపాటి రాజగోపాల్ రగడ సృష్టించారు. ఉద్రిక్తతలు పెచ్చుపెరిగి వున్న సమయంలో రాజగోపాల్ అక్కడకు పోకుండా వుంటేనే బాగుండేది. ఆయన మొత్తం సీమాంధ్రులకు ప్రతినిధినంటూ అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారు. లగడపాటి చేస్తున్న రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్ల హైదరాబాద్‌లో వుండే సీమాంధ్రులకు ఇబ్బందులు కలిగేటట్లున్నాయి.

పి.శ్రీహరి హైదరాబాద్

నీరోలా కేంద్ర ప్రభుత్వం

చిన్నప్పుడు పుస్తకాల్లో రోమ్ నగరం తగలబడి పోతుంటే నీరో చక్రవర్తి ఫిడేలు వాయించాడని చదివి అలా చేశాడా అని సందేహం కలిగేది. రాష్ట్రం తెలంగాణ సమస్యతో అట్టుడికిపోతూ చిన్నాభిన్నమై పోతుంటే చూస్తూ కూర్చొన్న కేంద్ర ప్రభుత్వాన్ని చూస్తుంటే నీరో చక్రవర్తి నిజంగానే అలా చేశాడేమో అనిపిస్తుంది.

బి.రామకృష్ణ కావలి

నెహ్రూ కుటుంబం చేసిందేమిటి?

నెహ్రూ, గాంధీల కుటుంబం వల్ల భారతదేశానికి చాలా నష్టం జరిగింది. ఈ కుటుంబం వల్లనే జమ్ముకాశ్మీర్ అన్యాక్రాంతమయ్యింది. 64 ఏళ్ల సుదీర్ఘ కాంగ్రెస్ పరిపాలనలో బీదవాడు బీదవాడుగానే వున్నాడు. కోటీశ్వరులు మరింత కోటీశ్వరులు అవుతున్నారు. ఈ దశలో రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని కోరు

కొరవ 14వ పేజీలో

70 ఏళ్ల క్రితం ఈవారం

10-10-1941
పేజీలు : 10 వెల: అణా

గులిస్తాన్

ఇరాన్ దేశీయుడు 'సాది' కవి పర్షియన్ భాషలో రచించిన 'గులిస్తాన్' అనే కావ్యాన్ని కవి కోకిల దువ్వూరు రామిరెడ్డి గారు "గులాబితోట" అనే పేరుతో తెనిగించారనే సువార్త మీకు వినిపిస్తున్నాను. ఇదే కావ్యాన్ని జైల్లో కష్టపడి తెనిగించి పోగొట్టినాడట బొద్ద వాజ్మయబ్రహ్మ దుగ్గిరాల బలరామకృష్ణయ్యగారు.

నెల్లూరు ముచ్చట్లు

ఖైదీని పాము కరచుట

నెల్లూరు సబ్‌జైల్లో 9వతేది మధ్యాహ్నం మారువూడి తిరుపాలు అనే ఖైదీని పులిపేంజిర అనే విషసర్పం కరచిందని, చంపబడ్డ ఆ పామును, ఆ ఖైదీని పెద్దాస్పత్రికి తెచ్చారని, వెంటనే పొటాషియం పర్మాంగనేట్ వేశారని, తర్వాత అడ్మిట్ చేసుకున్నారని తెలుస్తున్నది.

పొటాషియం పర్మాంగనేటా పాము విషాన్ని దింపేది? రామ!రామ! ఆసుపత్రులు పాము చికిత్సలో నిస్సహాయస్థితిలో నున్నవి.

చిత్తూరు నాగయ్యరాక

16-10-41తేది కళా నిలయము వారు నెల్లూరులో జరుపు "అపోహ" నాటకం. చిత్తూరు నాగయ్యగారి ఆధ్వర్యాన జరుగుతుందట.

సినిమాలోక నటాగ్రణులలో వకరని పేరొంచిన మన రాయప్రోలు శిష్యుని మనం గౌరవించడం సముచితం గదా!

50 ఏళ్ల క్రితం ఈవారం

6-10-1961
పేజీలు: 12 వెల: 0-20 న.పై

ఎలక్షన్ విశేషాలు

భారతరక్షణ మంత్రి వి.కె.కృష్ణమీనన్‌ను పార్లమెంటుకు అనంతపురం నుంచి పోటీ జేయవలసిందిగా ఆ జిల్లా కాంగ్రెస్ సంఘం ఆహ్వానించింది. అట్లనే ముఖ్యమంత్రి సంజీవయ్యను కళ్యాణ దుర్గం నుండి పోటీ చేయవలసిందిగా పిలిచింది. వ్యక్తుల నుంచి 5వేల రూపాయలకు మించిన మొత్తాలను విరాళాలుగా స్వీకరించవద్దని అఖిలభారత కాంగ్రెస్ సంఘం ప్రదేశ్ కాంగ్రెస్ సంఘాలను ఆదేశించిందట. అమలు జరుగని ఈ ఆదేశాలు దేనికి? ఎన్నికల చట్టం నిర్దేశించిన విధంగా అసెంబ్లీ అభ్యర్థికి 7వేలు, పార్లమెంటు అభ్యర్థికి 25వేలు ఖర్చు అయినా దేశం మొత్తం మీద కాంగ్రెస్ అభ్యర్థులందరికి 3కోట్ల రూపాయలు కావాలట. ఇక యదార్థంగా అయ్యేది లెక్కకు తీసుకుంటే 15కోట్లకు తక్కువ కాదేమో!

పెనుబర్తి హత్య - మరణదండన!

24-4-61తేది నెల్లూరు తాలుకా పెనుబర్తిలో జరిగిన వెడిచర్ల రామరాఘవరెడ్డి హత్యానేరాన్ని జిల్లా సెషన్సు జడ్జి సమియుద్దీన్ అహ్మద్ విచారించి సదరు రాఘవరెడ్డి సోదరులు కృష్ణారెడ్డి, వెంకట్రామిరెడ్డి గారలకు ఉరిశిక్ష విధిస్తూ 3తేది తీర్పు జెప్పారు. మరొక ఇద్దరు ముద్దాయిలైన కృష్ణారెడ్డి సేద్యగాండ్లను నిర్దోషులుగా విడుదల చేయబడినారు. కృష్ణారెడ్డి ఆ గ్రామ పంచాయితీ అధ్యక్షుడు. రామరాఘవరెడ్డి తన ఆస్తిని తన వుంపుడుకత్తె సంతానానికి సంక్రమింపజేశాడనే కినుకలో అతని సోదరులైన కృష్ణారెడ్డి, వెంకట్రామరెడ్డి వగైరాలు ఈ హత్యకు పూనుకున్నారని ప్రాసిక్యూషన్ నేరారోపణ. ప్రత్యక్షసాక్షుల సాక్ష్యాన్ని విశ్వసిస్తూ సోదరుని క్రూరంగా హత్యగావించిన ఈ నేరంలో న్యాయం చేకూర్చబడవలెనంటే, మొదటి ఇరువురు ముద్దాయిలు మరణదండనకర్హులని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు.

నెల్లూరు ముచ్చట్లు

ఎర్రగడ్డలు @ 30

ఏ నిత్యావసర వస్తువుల ధర ఎప్పుడు ఎందుకు పెరిగి పోతుందో చెప్పలేని రోజులివి. మాసం క్రితం వరకు పది నుంచి పదిహేను రూపాయల వరకు అమ్ముతుండిన ఎర్రగడ్డలు ఒక్కసారిగా ముప్పై రూపాయలయ్యాయి. దసరా పండుగ ముందు ఎర్రగడ్డల రేట్లు మరీ ఇంతగా పెరిగి పోవడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజానీకానికి ఇబ్బందిగా పరిణమించింది.

చండీయాగానికి లక్షలు వసూలు!

దేవీ శరన్నవ రాత్రులను పురస్కరించుకొని నెల్లూరు రాజరాజేశ్వరమ్మ దేవస్థానంలో తొమ్మిది రోజులపాటు చండీయాగం జరిగింది. ఈ యాగంలో పాల్గొన్న భక్తుల వద్ద నుంచి లక్ష నుంచి రెండు లక్షల రూపాయల వరకు ఆలయ బాధ్యతలు చూస్తున్న నాయకుడు వసూలు చేసినట్లు తెలిసింది. ఒక్కోరోజు ముగ్గురు నుంచి నలుగురు వరకు ఈ యాగంలో కూర్చోబెట్టారట. మొత్తం మీద ఆలయంలో చండీయాగం పెత్తనం చూసే వారికి ఆదాయ వనరుగా మారడం చర్చనీయాంశంగా మారింది.

రాజరాజేశ్వరమ్మను పూజించవచ్చిన డిజిపి!

నెల్లూరీయుడు డిజిపి వేణుంబాక దినేష్‌రెడ్డి జిల్లాలో తన రెండు రోజుల పర్యటనకు ముఖ్య కారణం రాజరాజేశ్వరమ్మకు ప్రత్యేక యాగం చేయతలపెట్టడమేనని చెప్పవచ్చు. అధికారికంగా, అనధికారికంగా కొన్ని కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నా గత ఏడాది రాజరాజేశ్వరమ్మను దర్శించుకొన్నాకే డిజిపిగా ఇబ్బందులు లేకుండా నియమితుడయ్యానని భావించిన ఆయన 4వ తేది సతీసమేతంగా రాజరాజేశ్వరమ్మను ప్రత్యేకంగా అర్చించి యాగం నిర్వహించారు.

అధికార దర్పంలేని డిజిపి

రాష్ట్రంలోని పోలీసులకు బాస్ అయిన వేణుంబాక దినేష్‌రెడ్డి తన నెల్లూరు పర్యటనలో చూసేందుకైనా కించిత్ అధికార దర్పం ప్రదర్శించక పోవడం ఆశ్చర్యపర్చింది. స్వగ్రామం తాళ్లపూడిలో గ్రామస్తులను పేరు పేరున పిలవడం, నెల్లూరు పోలీసు ఆఫీసులో ప్రజావిజ్ఞప్తులు స్వీకరించడం, తనరాకపై సరైన సమాచారం పోలీసులు అందివ్వక పోవడంపై విలేకరులకు సారీ చెప్పారు. కొత్తగా బాధ్యతలు తీసుకొంటున్న పోలీసులను నిజాయితీగా మసలమని, తనను అదే ఈ స్థానంలో నిలబెట్టిందన్నారు. పోలీసు అధికారుల సంఘం సమావేశంలోనూ వాగ్దానాలు చేయలేదాయన. సాయంత్రం అనిల్ గార్డెన్స్‌లో పలువురు ఆత్మీయులు ఆయన్ను కలుసుకొన్నప్పుడు వారి వ్యక్తిగత క్షేమ సమాచారాలు అడగడం విస్మయ పర్చింది. డిజిపి వ్యవహార సరళిని కొందరు పోలీసు అధికారులైనా చూసి నేర్చుకొంటే పోలీసు శాఖకు ప్రజల్లో పలుకుబడి పెరుగుతుంది.

ఇస్కాన్‌కు వేమిరెడ్డి భూరి విరాళం!

నెల్లూరులో చక్కగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఇస్కాన్ సంస్థకు ప్రముఖ కాంట్రాక్టర్ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఎనిమిది లక్షల రూపాయల విరాళం సంస్థ నిర్వాహకుడు డాక్టర్ సుఖదేవ స్వామికి స్వయంగా అందించారు. ఈ మొత్తంతో గోశాలతోపాటు సమావేశ మందిర నిర్మాణం చేపట్టాలని సూచించారు.

గాంధీ జయంతి - జీవహింస - మద్యం!

జాతిపిత మహాత్మాగాంధీ జన్మదినోత్సవమైన గాంధీ జయంతి రోజు జీవహింస, మద్యం అమ్మకాలు లేకుండా చూడవలసిన బాధ్యత అధికారులు స్వీకరించాల్సి వుంది. కానీ మొన్న అక్టోబర్ రెండవ తేది మద్యం, మాంసం విక్రయాలు యదేచ్ఛగా జరిగాయి. ప్రపంచానికే ఆదర్శమూర్తి అయిన గాంధీ జయంతి రోజు వీటిని అడ్డుకొన్న ఎక్సైజ్, కార్పొరేషన్, ఆరోగ్య శాఖాధికారులు లేరు. లంచాల అమేధ్యానికి అలవాటు పడిన అధికారుల్లో మార్పు ఎప్పుడో?

రోశయ్య రాష్ట్రపతి కావాలి

తమిళనాడు గవర్నర్ కొణిజేటి రోశయ్యను రాష్ట్రపతి పదవిలో చూడాలని వుందని ఆయన మిత్రుడు కెవిచలమయ్య అభిలషించారు. రోశయ్య ఒక రోజు నెల్లూరు పర్యటన సందర్భంగా చలమయ్య ఇంటికి వెళ్లి మధ్యాహ్నం భోజనం చేశారు. ఈ సందర్భంగా రోశయ్యను సన్మానించిన చలమయ్య అన్ని హోదాల్లో కూడా రోశయ్య పాత స్నేహాన్ని మరువక తన ఇంటికి రావడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు. భగవంతుని దయ, బాధ్యతలు సక్రమంగా నిర్వహించబట్టే ఇన్ని పదవులు వాటంతట అవే వచ్చాయని రోశయ్య ఈ సందర్భంగా చెప్పారు.

నెల్లూరు రెడ్‌క్రాస్‌కు పురస్కారం!

అత్యుత్తమ సేవలకుగాను నెల్లూరు రెడ్‌క్రాస్ సంస్థకు కేంద్ర ప్రభుత్వం అవార్డ్ ఆఫ్ మెరిట్ సర్టిఫికేట్‌ను ప్రకటించింది. దీన్ని సెప్టెంబర్ 27వ తేది న్యూఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి గులాంనబి ఆజాద్ రెడ్‌క్రాస్ కార్యదర్శి డాక్టర్ ఎ.వి. సుబ్రహ్మణ్యంకు అందించారు.

విద్యుత్ కోతతో నరక యాతన

నెల్లూరు నగరంలో ప్రతినిత్యం ఆరు గంటలపాటు విధిస్తున్న విద్యుత్ కోతకు జనం అల్లాడిపోతున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి 11 గంటల వరకు విధిస్తున్న కోతకు ఇళ్లతో పాటు ఇటు ఆఫీసుల్లోనూ పనులు స్తంభించిపోతున్నాయి. మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఆరు గంటల వరకు విధిస్తున్న విద్యుత్ కోత భలే చీకాకు పుట్టిస్తోంది. విద్యుత్ కోతకు ఆజ్యంలా మిల మిల లాడే ఎండ కూడా తోడవడంతో జనం బాధ చెప్పనలవి కాకుండా వుంది. మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో చెప్పిన వేళలు కాకుండా ఇష్టమొచ్చినట్లు విధిస్తున్న విద్యుత్ కోతకు జనం హాహాకారాలు పెడుతున్నారు. పాలకులను, విద్యుత్ శాఖాధికారులను శాపనార్థాలు పెడుతున్నారు. కానీ వీటిని చెవికెక్కించుకొనే వారే లేరు.



దసరాను పురస్కరించుకొని జొన్నవాడ కామాక్షమ్మ దేవస్థానంలో ప్రసాద వితరణ చేస్తున్న మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పందిళ్లపల్లి అరుణమ్మ దంపతులు.

కాంగ్రెస్‌లో కంభం

ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి తెలుగుదేశం పార్టీ జెండా వదలి పెట్టి కాంగ్రెస్ పార్టీ జెండా చేతపట్టారు. 2, 3, 4 తేదీల్లో ఉదయగిరి నియోజకవర్గంలో ఆర్థిక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జరిపిన పర్యటన, మాట్లాడిన సభల్లో కంభం విజయరామిరెడ్డి కూడా పాల్గొన్నారు. ఉదయగిరి తెలుగుదేశం రాజకీయాల్లో బొల్లినేని రామారావుకు ప్రాముఖ్యం పెరగడంతో కంభం విజయరామిరెడ్డి తట్టుకోలేక కాంగ్రెస్ వైపు వచ్చేశారు. ఈ పరిణామం బొల్లినేని రామారావు భవిష్యత్తుకు శుభకరమే.

తల్లి దగ్గరకు నర్తన!

తల్లీబిడ్డల ప్రేమను వర్ణించను అక్షరమాల చాలదు. ఎవరో ఒక కవి చెప్పినట్లు చెడ్డ తల్లి వుండదని అక్షరాల నిరూపించింది చిన్నారి నర్తన. తన ప్రియుడితో కలసి నర్తనను తల్లి నాగ చైతన్య నానా చిత్రహింసలకు గురిచేసి మరణశయ్యకు చేరువగా తీసుకెళ్లిన విషయం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ప్రస్తుతం నెల్లూరు పొదలకూరు రోడ్డులోని శిశు సంక్షేమ హాస్టల్‌లో కోలుకొన్న నర్తన తన తల్లి దగ్గరకు వెళ్తానని బాలల సంక్షేమ సమితి సభ్యుల ముందు స్పష్టం చేసింది. కలెక్టర్‌కు ఈ విషయం చెప్పి పంపుతామని వాళ్లు నర్తనకు హామీ ఇచ్చారు. చేసిన తప్పుకు పశ్చాత్తాపపడుతున్నా... నా బిడ్డను బాగా చూసుకొంటా. నర్తన పేరిట వదాన్యులు డిపాజిట్ చేసిన డబ్బు ఒక్క పైసా కూడా వద్దని ఈ సందర్భంగా నాగచైతన్య చెప్పడం విశేషం.

షుగర్ డాక్టర్ల రాష్ట్ర సదస్సు!

ఆంధ్రప్రదేశ్ డయాబెటిక్ ఫెడరేషన్ నేతృత్వంలో షుగర్ డాక్టర్ల రాష్ట్ర కొరవ 14వ పేజీలో







● రాష్ట్రమంతటా

పోలీసు ప్రజావిజ్ఞప్తుల దినం!

నెల్లూరులో దినేష్‌రెడ్డి ప్రకటన



పోలీసాఫీసులో జరిగిన ప్రజావిజ్ఞప్తుల దినంలో దినేష్‌రెడ్డి.

డిజి హోదాలో తొలిసారిగా నెల్లూరు వచ్చిన వేణుంబాక దినేష్‌రెడ్డి మొదట స్వగ్రామం తాళ్లపూడి వెళ్లి గ్రామస్తులను పేరుపేరున పలకరించారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజావిజ్ఞప్తుల దినంలో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి ప్రత్యక్షంగా విషయాలు తెలుసుకొనే ఈ కార్యక్రమం దినేష్‌రెడ్డి మదిని దోచింది. ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఎస్పీ రమణకుమార్‌పై ప్రశంసల జల్లు కురిపించిన ఆయన రాష్ట్రమంతటా ఈ కార్యక్రమం జిల్లా ఎస్పీల ఆధ్వర్యంలో జరిగేలా ఆదేశాలిస్తానన్నారు. అనంతరం విలేకరులతో నెల్లూరు యాసలో మాట్లాడుతూ పేకాట క్లబ్బులను రాష్ట్రవ్యాపితంగా మూత వేయించడం వల్ల మహిళలు పోలీసులను అభినందిస్తున్నారన్నారు. బెల్ట్ మద్యం షాపులపై ఎక్సైజ్ అధికారులతో మాట్లాడి ఉక్కుపాదం మోపుతామన్నారు. జాతీయ రహదారులపై వుండే డాబాల్లో మద్యం అమ్మకుండా పోలీసులు చర్యలు తీసుకొంటారన్నారు. జిల్లాలో సంచలనం రేకెత్తించిన మనీ సర్క్యులేషన్ స్కీం దర్యాప్తు బాధ్యతలను ఇక నుంచి సిఐడి పోలీసులు చూస్తారని, వీరికి స్థానిక పోలీసులు సహకరిస్తారన్నారు. నాయుడుపేటలో కొత్త పోలీస్ సబ్ డివిజన్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రత్యేక రాష్ట్రం, సకల జనుల సమ్మె విషయంలో ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే పోలీసులు చూస్తూ ఊరుకోరని ఐకాస నేత కోదండరాం తన పరిధి దాటినట్లు అనిపిస్తే అదుపులోనికి తీసుకొంటాం. ఈ రోజు తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి వచ్చే బస్సులను నల్గొండలో అడ్డగించారని తెలిసింది. జాతీయ రహదారుల దిగ్బంధం నేరమని పోలీసులు ఈ విషయమై చట్టప్రకారం చర్యలు తీసుకొంటారన్నారు. దుస్థితిలో వున్న నెల్లూరు పోలీస్ క్వార్టర్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నిస్తాను. దీనికోసం కేంద్ర నిధులు సాధిస్తాను. జిల్లాలో హోంగార్డుల నియమాకంపై జరిగిన అవకతవకలపై దర్యాప్తు జరిపిన నివేదిక ప్రభుత్వం దగ్గర పెండింగ్‌లో వుందన్నారు. మంత్రి శంకరరావు ప్రైవేట్ సెక్యూరిటీ పెట్టుకొంటానన్నా నిబంధనలు ఒప్పుకోవని ఆయనకు పోలీసు భద్రత కొనసాగుతుందన్నారు. సంచలనం సృష్టించిన సూరి హత్యకేసులో నిందితుడు భాను గోదావరి జిల్లాలలో ఉన్నారన్న సమాచారం ఉందని అతన్ని త్వరలో పట్టుకొంటామని దినేష్‌రెడ్డి స్పష్టం చేశారు.

● ఏర్పడని

బ్లాక్ బోర్డుల పథకం!

తప్పంతా వ్యవసాయ శాఖాధికారులదే!

వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను రైతులకు తెలియజెప్పేందుకు ప్రభుత్వం 2003లో బ్లాక్ బోర్డుల పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఆయా గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బ్లాక్ బోర్డులను ఏర్పాటుచేసి వాటి ద్వారా సాగులో మెళకువలు, వ్యవసాయానికి సంబంధించిన సూచనలు, సలహాలతోపాటు వ్యవసాయ శాఖాధికారుల పర్యటన వివరాలు నమోదు చేయాల్సి వుంటుంది. ఆదర్శ రైతులు ఈ బాధ్యతలను నిర్వర్తించాల్సి వుంది. ఈ పథకంలో భాగంగా జిల్లావ్యాప్తంగా వివిధ గ్రామాల్లో 1050 బ్లాక్ బోర్డులను ఆయా పంచాయితీలు, పాఠశాలు, వ్యవసాయ శాఖ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేశారు. షుమారు ఐదు లక్షల రూపాయలు ఇందుకోసం ఖర్చు పెట్టారు. అంతవరకు బాగానే వున్నా అసలు లక్ష్యం మాత్రం నెరవేరలేదు. మొదటి నాలుగు సంవత్సరాలు అనగా 2007 వరకు బ్లాక్ బోర్డు బాధ్యతలు వ్యవసాయశాఖ, ఆ తర్వాత ఆదర్శ రైతులకు అప్పజెప్పింది ప్రభుత్వం. కానీ ఎక్కడా బ్లాక్ బోర్డులను నింపేవారే కన్పించకపోవడంతో బ్లాక్ బోర్డులన్నీ బ్లాంక్ బోర్డులుగా దర్శనమిస్తున్నాయి. చాలా ప్రాంతాల్లో ఈ పథకం వుందన్న సంగతి రైతులకు తెలియదంటే వ్యవసాయశాఖ ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందో తెలుస్తుంది. అధికారులకు దీనిపై అవగాహన లేకపోవడం విశేషం. గ్రామసభల్లో, రైతు చైతన్య యాత్రల్లో ఈ పథకం ప్రస్తావనే లేకపోవడంతో ప్రభుత్వ ఉద్దేశం, ప్రజాధనం వృధా అవుతున్నాయి. కుర్చీల కోసం, అధిపత్యం కోసం కుమ్ములాడుకొనే వ్యవసాయశాఖ అధికారులు ఇలాంటి వాటిపట్ల శ్రద్ధపెడితే రైతులకు మేలు జరుగుతుంది.

నెల్లూరు అంటే అభిమానం

● సన్మాన సభలో తమిళనాడు గవర్నర్ రోశయ్య



రోశయ్యను సన్మానిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్పీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీధర్‌కృష్ణారెడ్డి, వివేకానందరెడ్డి.

మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు గవర్నర్ డాక్టర్ కొణిజేటి రోశయ్యకు పౌర సన్మాన కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. గతంలో మంత్రిగా, ముఖ్యమంత్రిగా పలుమార్లు నగరానికి వచ్చినప్పటికీ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా నగరానికి రావడంతో రోశయ్య అభిమానులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆర్యవైశ్యులు ఘనంగా స్వాగతం పలికారు. స్వర్ణవేదికలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో పౌరసన్మానం, విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల కార్యక్రమం జరిగాయి. గవర్నర్ రోశయ్య తనకు జరిగిన సత్కారానికి హృదయ పూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. నెల్లూరన్నా, నెల్లూరీయులన్నా తనకెంతో అభిమానం అని చెప్పిన ఆయన పదవులు ఎన్ని వచ్చినా తనలో మార్పులేదని అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ ఒకటిగానే వుంటానన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించిన ఆయన చిన్నతనంలో తనకు బహుమతిగా వచ్చిన కాశీ మజిలీ కథల పుస్తకాన్ని గుర్తు చేసుకొన్నారు. అది ఇప్పటికీ తన వద్ద భద్రంగా దాచుకొన్నానని ఇలాంటివి తీపి గుర్తులన్నారు. ఆనం బ్రదర్స్‌ను ప్రత్యేకంగా అభినందించిన రోశయ్య సభకు అధ్యక్షత వహించి తన చక్కటి తెలుగుతో ఆకట్టుకొన్న అదనపు జాయింట్ కలెక్టర్ లక్ష్మీకాంతంను ప్రశంసించారు. ఎస్పీ రమణకుమార్ సమర్థుడైన అధికారన్నారు. నగర శాసనసభ్యుడు ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి ప్రవృత్తిరీత్యా వైశ్యుడని చమత్కరించాడు. ఆయనకు ముందుగా మాట్లాడిన ఆర్థిక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి రోశయ్యను పొగడ్తలతో ముంచెత్తారు. దేశంలోని ఆర్థిక మంత్రులందరికీ రోశయ్య ఆదర్శమని ప్రతి ఒక్కరు ఆయన్ను కలవరిస్తుంటారన్నారు. రూరల్ శాసనసభ్యుడు ఆనం వివేకానందరెడ్డి, శాసనమండలి సభ్యుడు వాకాటి నారాయణరెడ్డి, ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి, కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి, మాదాసు గంగాధరం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గజమాలతో, శాలువతో రోశయ్యను ఘనంగా సన్మానించి మెమెంటో అందజేశారు. పలువురు నగర ప్రముఖులు, చిరంజీవి యువత, ఆర్య వైశ్య నేతలు పాల్గొని పుష్పగుచ్ఛాలు అందజేసి తమ అభిమానాన్ని చాటుకొన్నారు. చివరగా 87 మంది బాలబాలికలకు పురస్కారాలు అందజేయడంతోపాటు సరస్వతి నమస్తుభ్యం అనే పుస్తకాన్ని గవర్నర్ ఆవిష్కరించారు.

టాస్క్‌ఫోర్స్ బలహీనం

ఫలితమివ్వని పథకం

విద్య, వైద్యం, సంక్షేమ రంగాల్లో అమలవుతున్న పథకాలను సక్రమంగా నిర్వహించేందుకు కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి ఏర్పాటుచేసిన టాస్క్‌ఫోర్సులో "ఫోర్సు" లేకుండా పోతోంది. మూడు మండలాలకు ఒకరు చొప్పున 17 మంది జిల్లాస్థాయి అధికారులతో ఈ టాస్క్‌ఫోర్సు ఏర్పాటైంది. వివిధ శాఖల అధికారులకు ఇది అదనపు బాధ్యత. వీరు వారం వారం తనిఖీలు నిర్వహించి నివేదికలను శుక్రవారం కలెక్టర్‌కు అందజేయాల్సి వుంటుంది. అంతవరకు బాగానే వున్నా అసలే సంబంధిత శాఖల విధులను నిర్వర్తించడమే గగనం అవుతున్న పరిస్థితుల్లో అదనపు బాధ్యతలు పైనపడడంతో టాస్క్‌ఫోర్సు ఉద్దేశం దెబ్బతింటోంది. తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహించి నివేదికలు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు టాస్క్‌ఫోర్సు సభ్యులు. మరోవైపు అసలు బాధ్యత, టాస్క్‌ఫోర్సు బాధ్యతలతో వీరు అన్ని మండలాలకు ప్రత్యేక అధికారులుగా కూడా విధులు నిర్వర్తించవలసి వస్తుండడంతో తీవ్రమైన పని ఒత్తిడికి గురౌతున్నామని, దీంతో మొదటికే మోసం వచ్చేటట్లు వుందని పలువురు వాపోతున్నారు. టాస్క్‌ఫోర్సు సభ్యులకు కేవలం తనిఖీ చేసే అధికారం మాత్రమే ఇవ్వడంతో తామేమీ చేయలేమనే ధైర్యం, నిర్లక్ష్యం తమపట్ల క్రిందిస్థాయి సిబ్బందిలో కల్గుతున్నాయని అధికారులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందాన టాస్క్‌ఫోర్సు పనితీరు ఎలా వున్నా ఆయా శాఖల్లో పాలన మాత్రం కుంటుపడుతుందన్న విషయాన్ని అధికారులు అంగీకరిస్తున్నారు. టాస్క్‌ఫోర్సు సభ్యుల మధ్య సమన్వయం కొరవడడంతో ఉత్త ఫోర్సుగా మిగిలింది.

గ్రామీణ పేదల అభివృద్ధి పథకం!

సరికొత్తదండీ!

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేదలకు వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వీటిని అమలు చేసేందుకు సంకల్పించారు. దీనికి అవసరమైన నిధులు ప్రపంచ బ్యాంకు నుంచి రుణంగా పొందనుంది ప్రభుత్వం. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదరిక నిర్మూలన కోసం నిధులు కేటాయించేందుకు ఇబ్బంది పడుతున్నాయి. నిధుల కొరత ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు తయారుచేసి ప్రపంచ బ్యాంకు రుణం కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపింది. జిల్లాలో గత ఆరు నెలల నుంచి గ్రామీణ ప్రాంతాల్లో సంక్షేమ పథకాలు కుంటుపడ్డాయి. అక్టోబర్ నెలలో పేదరిక నిర్మూలన సంస్థ దాదాపు రాష్ట్ర వ్యాప్తంగా 132 కోట్ల రూపాయలు విడుదల చేయనుంది. ఈ నిధులు కేవలం ఉద్యోగుల జీతభత్యాలకే సరిపోతాయని అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. విడుదలచేసే నిధులు మార్చి వరకు ఖర్చు చేయాలన్న నిబంధన కూడా విధించారు. ప్రపంచ బ్యాంకు నుంచి రుణం వస్తేనే జిల్లాలోని గ్రామీణ పేదలకు అభివృద్ధి పథకాలు అమలుచేసే అవకాశం వుంది.

జిల్లాలో నత్తనడకన సాగునీటి ప్రాజెక్ట్‌ల నిర్మాణం

నిధుల కొరత కారణంగా జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు ముందుకు సాగడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక వనరులు సమకూర్చడంలో విఫలం చెందుతోంది. అయితే ఈ విషయం ఎక్కడా బయటపడకుండా మంత్రులు, అధికారులు జాగ్రత్త పడుతున్నారు. సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కొరత వుందన్న విషయం బయటపడితే ప్రజలు, రైతుల నుంచి వ్యతిరేకత వస్తుందన్న అభిప్రాయంతో అధికారులున్నారు. టెండర్ ద్వారా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు, కంపెనీలు పనులు పూర్తి చేసేందుకు ముందుకు రావడం లేదు.

బిల్లులు ఇవ్వడం లేదు!

కోట్ల రూపాయలతో పనులు ప్రారంభించిన కంపెనీలకు సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో మధ్యలోనే పనులు నిలిపి వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిర్ణీత సమయానికి పనులు పూర్తికాకపోవడంతో ఆయకట్టు రైతులకు సాగు నీరందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రాజెక్టులకు నిధుల కొరత లేకపోయినా పెరిగిన ధరలకు అనుకూలంగా తిరిగి టెండర్ పిలవాలని కొన్ని కంపెనీలు ప్రభుత్వంపై ప్రజా ప్రతినిధుల చేత ఒత్తిడి చేయిస్తుంటారు. దీంతో పనులు జరగక పోగా, కాలయాపన జరిగేకొద్దీ ప్రభుత్వంపై మరింత ఆర్థిక భారం పడుతుంది.

నత్తనడకన నెల్లూరు బ్యారేజి

ప్యాకేజి నెం.6లో చేర్చిన నెల్లూరు బ్యారేజి నిర్మాణం కోసం 126.70 కోట్ల రూపాయలు కేటాయించింది ప్రభుత్వం. ఈ పనులు దక్కించుకున్న ఎ.కె.ఆర్ కోస్టల్(జి.వి) కంపెనీ ఇప్పటి వరకు 42.21 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. ఈ కంపెనీ చేసిన పనుల్లో నాణ్యత లేదంటూ వివిధ రాజకీయ పార్టీల నేతలు ఆందోళన చేసిన సంఘటనలు వున్నాయి. పనులు సక్రమంగా చేయకపోయినా కూడా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేక పోయారు. అటువంటి కంపెనీకి పనులు పూర్తి చేసేందుకు మరో 30 నెలలు గడువు పొడిగించడం విమర్శలకు దారితీస్తున్నది. చేసిన పనులకు బిల్లులు రావడం లేదంటూ ఆ

> **"జిల్లాలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్ట్‌ల పనులన్నీ నత్తనడకన జరుగుతున్నాయి. నిధుల కొరతే దీనికి కారణమనవచ్చు. కాని ఈ విషయం బయటపడనీయక ప్రజాప్రతినిధులు, అధికారులు జాగ్రత్త పడుతున్నారు."**

జిల్లాలో మేజర్ ఇరిగేషన్ పనుల క్రింద ఈదూరు – కోడూరు చెరువుల అభివృద్ధి, లైనింగు పనులు చేపట్టడం, దగదర్తి – ముంగమూరు కాల్వల అభివృద్ధి, లైనింగ్ పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. అలాగే సంగం బ్యారేజి, నెల్లూరు బ్యారేజీల నిర్మాణం, పెన్నాడెల్టా ఆధునీకరణ, కనిగిరి రిజర్వాయర్ అభివృద్ధి, రెగ్యులేటర్ల మరమ్మత్తులు చేపట్టే పనులు ఇందులో చేర్చారు. ఇవి కాకుండా మరో ఏడు కోట్ల రూపాయల వ్యయంతో 750 పనులు కేటగిరి – ఎ క్రింద నీటి తీరువా నిధులతో చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి.

ఈదూరు – కోడూరు చెరువుల మరమ్మత్తులు, కాలువ లైనింగ్ పనులు పూర్తి చేసేందుకు ఐదు కోట్ల 85 లక్షల రూపాయలు కేటాయించారు. ఇప్పటివరకు కేవలం 50 శాతం నిధులనే ఖర్చు చేయగలిగారు. 2006 – 07 సంవత్సరంలో అగ్రిమెంటు చేసుకున్న కాంట్రాక్టర్ సకాలంలో బిల్లులు మంజూరు కాలేదన్న కారణంగా పనులు నిలిపివేశాడు. కాంట్రాక్టర్‌కు ఇటీవలే నీటి పారుదలశాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు.

గిట్టుబాటేది?

దగదర్తి – ముంగమూరు కాలువ పనులకు ఐదు కోట్ల రూపాయలతో టెండర్ పిలిచినా ఒక్కరు కూడా టెండర్ దాఖలు చేయలేదు. గిట్టుబాటు కాదన్న కారణంగా ఎవరూ ముందుకు రాలేదు. 2011 – 12 సంవత్సరంలో షెడ్యూల్ రేట్లకు రివైజ్ చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. సంగం బ్యారేజి నిర్మాణ పనులను 33వ ప్యాకేజీలో చేర్చి 122.50 కోట్ల రూపాయలు కేటాయించారు. ఈ భారీ ప్రాజెక్టు పనులను హైదరాబాద్‌కు చెందిన హార్విన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ దక్కించుకొంది. 2008 – 09 సంవత్సరంలో అగ్రిమెంటు చేసుకున్న కంపెనీ ఇప్పటివరకు కేవలం 13.56 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేయగలిగింది. ఈ ప్రాజెక్టు పనులు పూర్తి చేసేందుకు మరో 30 నెలలు గడువు పొడిగించింది ప్రభుత్వం.

పెన్నా డెల్టా ఆధునీకరణ పనులు పూర్తి చేస్తే మరింత ఆయకట్టు పెరిగే అవకాశం వుంది. సదరన్, ఈస్టర్న్ ఛానల్స్ లైనింగ్ పనులు, రెగ్యులేటర్ల మరమ్మత్తులు నేటికీ అసంపూర్తిగానే మిగిలిపోయాయి. 2008 – 09 సంవత్సరంలో జెవిఆర్ కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్ కంపెనీ వీటికి అగ్రిమెంటు చేసుకుంది. అగ్రిమెంటు ప్రకారం 2010 మే నెల నాటికి పనులు పూర్తి చేయాల్సి వుంది. 76.89 కోట్ల రూపాయలు కేటాయించగా ఇప్పటివరకు 15 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. గడువు పొడిగించేందుకు జిల్లా అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నారు. రెండున్నర సంవత్సరాలలో 15 కోట్ల రూపాయలు ఖర్చు చేసిన ఈ కంపెనీ గడువు పొడిగిస్తే పనులు ఏ మేరకు చేస్తుందో వేచి చూడాలి.

సర్వేపల్లి – కృష్ణపట్నం, ఈదగాలి – వల్లూరు కాలువల లైనింగ్, అభివృద్ధి పనులకు 80.40 కోట్ల రూపాయలు కేటాయించారు. 2008 – 09 సంవత్సరంలో అగ్రిమెంటు చేసుకున్న జిఎస్ఆర్ కంపెనీ ఈ పనులను 2010 ఏప్రెల్ నాటికి పూర్తిచేయాల్సి వుంది. సకాలంలో పనులు పూర్తి చేయలేని కంపెనీ ప్రతినిధులు మరో రెండు సంవత్సరాలు గడువు కావాలని కోరారు. 30.73 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు అధికారులు లెక్కలు చూపుతున్నారు. మీడియం ఇరిగేషన్ క్రింద చేపట్టిన పనులు ఏ ప్రాంతంలో కూడా ఇప్పటివరకు పూర్తికాలేదు.



నత్తనడకన సాగుతున్న పెన్నా బ్యారేజ్ నిర్మాణ పనులు.

కనుపూరు కాలువ ఆధునీకరణకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం దీనికిగాను 71.64 కోట్ల రూపాయలు కేటాయించింది.

ఒకటవ కిలోమీటరు నుంచి 55.350 కిలోమీటర్ల వరకు లైనింగ్ పనులు పూర్తి చేయాల్సి వుంది. అయితే ఇప్పటి వరకు 12.450 కిలోమీటర్ల వరకు 19.21 కోట్ల రూపాయల పని చేయగలిగారు. 2007 – 08 సంవత్సరంలో అగ్రిమెంటు ఒప్పందం చేసుకున్న ఎకెఆర్ కోస్టల్(జివి) లిమిటెడ్ కంపెనీ నిర్ణీత గడువులోగా పనులు పూర్తిచేయలేక పోయింది. పనులు తిరిగి ప్రారంభించక పోవడంతో అగ్రిమెంటు ఒప్పందం రద్దుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. జిల్లా నీటిపారుదల శాఖ అధికారులు వ్యవహరిస్తున్న తీరు సరిగా లేనందున కాంట్రాక్టర్లు పనులు చేయలేకపోతున్నారన్న ఆరోపణలు వున్నాయి.

ప్రజాప్రతినిధులు విఫలం!

గత నాలుగు సంవత్సరాల నుంచి జిల్లాలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు, కాలువల ఆధునీకరణ పనులు పూర్తి చేయించడంలో ప్రజాప్రతినిధులు సైతం పూర్తిగా వైఫల్యం చెందారు. జిల్లాలో జరుగుతున్న సాగునీటి ప్రాజెక్ట్‌ల పనుల్లో ప్రజాప్రతినిధులు కొన్ని పనులకు బినామీ కాంట్రాక్టర్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శ కూడా వుంది. దీని వల్లే వారు పనుల సాగతీతకు సహకరిస్తున్నారు. సాగునీటి సలహా బోర్డు సమావేశానికి కూడా జిల్లా ఎమ్మెల్యేలందరూ సక్రమంగా హాజరు కాకుండా పోతున్నారు. ఈ సమావేశానికి హాజరై రైతులు పడుతున్న ఇబ్బందులను సమావేశంలో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాల్సిన బాధ్యత వీరిపై వుందన్న విషయాన్ని మరిచి పోతున్నారు. జిల్లాలో పది మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు పార్లమెంటు సభ్యులు, ఇరువురు ఎమ్మెల్సీలు వున్నా ఎప్పుడూ నిండుగా ఈ సమావేశానికి హాజరు కాని పరిస్థితి. లక్షలాది మంది రైతు కుటుంబాలకు సంబంధించిన అతి ముఖ్యమైన సమస్య ప్రజాప్రతి నిధులకు పట్టడం లేదంటే వీరినేమనాలి?

పనులు ప్రారంభించి మధ్యలో వదిలివేయడం కారణంగా వరిసాగు చేయలేక పోతున్నారు రైతులు. జిల్లావ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో ఐదు లక్షల ఎకరాలకు పైగా సాగు చేసేందుకు రైతులు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో సాగునీటి ప్రాజెక్టులు ఎలా పూర్తి చేస్తారో రైతులకు ప్రజాప్రతినిధులు ఏమి సమాధానం చెబుతారో?

చందాదారులకు మనవి

- చందా పంపించేటప్పుడు తమ చందా నెంబరు, పూర్తి పేరు, చిరునామా తెలియపరచండి.
- మీ చందా నెంబరు, చందా ఏ తేదికి అయిపోతుందో, అడ్రసు రేపరు మీదనే ముద్రించి వుంటుంది.
- 'జమీన్‌రైతు' చందాదార్లు తమ చందాను ఎం.ఓ/డి.డి లేదా Online‌లో ఆంధ్రాబ్యాంక్, విఆర్‌కాలేజ బ్రాంచి, నెల్లూరు అకౌంట్ నెంబర్: 1068110110004 23లో ZAMINRYOT పేరుతో జమచేయవచ్చు. సకాలంలో చందా చెల్లించవలసినదిగా కోరుతున్నాము.
- చెక్కులు స్వీకరించబడవు.

జీవిత చందా రూ.1000/-

సంవత్సర చందా

స్వదేశంలో రూ.200/-

విదేశాలకు రూ.1000/-

జమీన్‌రైతు

పాగతోట, నెల్లూరు - 524 001

ఫోన్: 0861 - 2327354

సెల్: 98489 66190

రాష్ట్ర ప్రభుత్వానికి నూకలు చెల్లాయి!



కలువాయి సభలో మాట్లాడుతున్న కురుగొండ్ల.

వెంకటగిరి ఎమ్మెల్యే విమర్శ

కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు ప్రచార ఆర్భాటానికే తప్ప పేద ప్రజల చెంతకు చేరడం లేదని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ విమర్శించారు. పెరిగిన ధరలతో ప్రజలు సతమతం అవుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదన్నారు. కలువాయిలో జరిగిన రైతు మహిళా సదస్సులకు హాజరైన ఆయన పొదుపు మహిళలకు పావలావడ్డీ చెక్కులను, రైతులకు రుణవడ్డీ మాఫీ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రచారం కోసం రైతు, మహిళా సదస్సులను నిర్వహిస్తూ ప్రజలను ఏమార్చుతున్నాడని విమర్శించారు. రచ్చబండ కార్యక్రమంలో ఇచ్చిన అర్జీలను పరిష్కరించకపోగా ఉన్న రేషన్‌కార్డులు, ఇస్తున్న ఫించన్లను రద్దు చేయడం అన్యాయమన్నారు. ఒకప్రక్క తెలంగాణ సమస్య, మరోప్రక్క మంత్రుల అవినీతి ఆరోపణలతో ఏ క్షణంలోనైనా ప్రభుత్వం కూలేందుకు సిద్ధంగా వుందని జోస్యం చెప్పారు. రైతులకు ఇచ్చే సబ్సీడి విత్తనాలు, ఎరువులు నల్లబజారుకు తరలకుండా చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రత్నప్రసాద్, తహశీల్దార్ శ్రీనివాసులు, ఇన్‌ఛార్జి ఎంపిడిఓ భారతి, వ్యవసాయాధికారి రమేష్, వెంకటరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



తమిళనాడు గవర్నర్ కె.రోశయ్య నెల్లూరు సంతపేటలోని తన ఇంటికి రాగా సన్మానిస్తున్న ఆయన చిన్ననాటి మిత్రుడు కెవి.చలమయ్య.

ఉపాధ్యాయుల కొరత

చిల్లకూరు, పెళ్లకూరు మండలాల్లో ఉపాధ్యాయుల కొరత కారణంగా ఆయా పాఠశాలల్లోని విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్పొరేట్ పాఠశాలల్లో చదివించే స్థోమత లేక సర్కారు బడులకు పంపుతున్నా టీచర్లు లేకపోవడంతో తమ బిడ్డలకు చదువెలా వస్తుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పెళ్లకూరు, చిల్లకూరు, చెంబడిపాళెం, కానూరురాజుపాళెంలోగల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వుంది. దీంతో చదువులు కుంటుపడుతున్నాయి. చిల్లకూరు ప్రాథమిక పాఠశాలలో 58మంది, ప్రాథమికోన్నత పాఠశాలలో

చిల్లకూరు, పెళ్లకూరు మండలాల్లో పరిస్థితిది.

30మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. ప్రాథమిక పాఠశాలల స్థాయి పెంచి ప్రాథమికోన్నత పాఠశాలలుగా మార్చి 6,7 తరగతులను నిర్వహిస్తున్నప్పటికీ ప్రధానంగా ఇంగ్లీష్, సోషల్ సబ్జెక్టులను బోధించే ఉపాధ్యాయులు, గణితం, సైన్సు చెప్పే టీచర్లు తగినంతమంది లేకపోవడంతో వివిధ పాఠశాల్లో ఒక ఉపాధ్యాయుడే అన్ని సబ్జెక్టులను బోధించాల్సిన పరిస్థితి ఏర్పడుతుండడంతో అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. పిల్లల భవిష్యత్తును దృష్టిలో వుంచుకొనైనా ఉపాధ్యాయుల కొరతను తీర్చాల్సి వుంది.

కబ్జాకోరుల చేతుల్లో అల్లూరు చెరువులు!

అల్లూరు మండల పరిధిలో గల చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయి. కబ్జాకోరులు చెరువులను ఆక్రమించి ప్లాట్లు వేసి అమ్మకాలకు సిద్ధం అవుతున్నా పట్టించుకొనే అధికారే లేకపోవడంతో భూకబ్జాదారుల ఇష్టారాజ్యం అయ్యింది. కొందరు చెరువులను ఆక్రమించుకొని సాగు చేపడుతుండగా మరికొందరు వ్యాపారం చేస్తున్నారు. అల్లూరు పంచాయితీ పరిధిలో 22 గుంటలు వుండగా అవి చాలా వరకు ఆక్రమణ చెర చిక్కాయి. సాగుదారులు కొందరు వీటిని తమ పొలాల్లో

పట్టించుకోని అధికారులు

కలుపుకొనేశారు. అల్లూరు చెరువు 2500 ఎకరాలు వుండగా అందులో 300 ఎకరాలకు పైగా ఆక్రమణలకు గురైంది. చెరువులు ఆక్రమణలకు గురికావడంతో వర్షాకాలంలో నీటినిల్వ సామర్థ్యం తగ్గిపోతుండడం, కలుజుల ద్వారా నీరంతా సముద్రం పాలవుతోంది. అల్లూరు రోడ్డు ప్రక్కనే గల చెరువును ఆక్రమించుకొన్న కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అమ్మకాలకు పాల్పడుతున్నారు. కొందరు నేతలు కబ్జాదారులకు అండదండలు అందిస్తుండడంతో ఆక్రమణలు అధికమవుతున్నాయి.

● వరిగొండ

పిహెచ్‌సికి మోక్షం!

ఎమ్మెల్యే ఆదాల చొరవే కారణం

ఎట్టకేలకు వరిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నూతన భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారు. చాలాకాలంగా ఈ వైద్యకేంద్రం శిథిలావస్థలో వుంది. ఆరోగ్య కేంద్రానికి వైద్యచికిత్సకు వెళ్లే వాళ్లు భయపడాల్సిన పరిస్థితులు నెలకొని వున్నాయి. డాక్టర్లు, సిబ్బంది సైతం పగటిపూట వైద్యశాలలో వుండాలంటేనే జంకేవారు. అంతగా శిథిలమైపోయినా గ్రామంలో గల రాజకీయ వైషమ్యాల కారణంగా దాని బాగోగుల గురించి పట్టించుకొనే వారే లేకుండా పోయారు. అలాంటి పరిస్థితుల్లో శాసనసభ్యుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆరోగ్య కేంద్రంపై దృష్టిసారించడంతో ఎట్టకేలకు నూతన భవన నిర్మాణానికి మోక్షం లభించింది. 33 లక్షల రూపాయలు మంజూరు చేయించడంతో భవన నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. ఆదాల వీటికి భూమి పూజ చేశారు. కొన్నాళ్లుగా అతిగతి లేకుండా వున్న ఆరోగ్య కేంద్రానికి ఆదాల చూపిన చొరవను స్థానిక ప్రజలు ప్రశంసిస్తున్నారు.

పేదల స్థలాలు లాక్కొన్నారు!

ఆత్మకూరులో ఇందిరమ్మ ఇళ్లకోసం ఇచ్చిన స్థలాలను రద్దు చేసి ఇతర అవసరాల కోసం వినియోగించుకొంటామని సాక్షాత్తూ ఆర్థికమంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేసిన ప్రకటనతో లబ్దిదారులు హతాశులవుతున్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకంలో భాగంగా ఆత్మకూరులో దీనిని అమలు చేసినప్పటికీ ఇంత వరకు ఒక్కరు కూడా పక్కాగృహాన్ని నిర్మించుకోలేకపోయారు. దీనికి కారణం అధికారుల నిర్లక్ష్యం. ఇందిరమ్మ పథకం మార్గదర్శకాలను అనుసరించి నిర్మాణపరంగా అనుకూలించే స్థలాలను అందిస్తామని ఆనాడు ఆనం హామీ ఇచ్చినా తర్వాత ఆ జాడే లేదు. పలుమార్లు లబ్దిదారులు లెవలింగ్ పనులు చేపట్టాలని, అంతర్గత రోడ్లు వంటి అభివృద్ధి పనులు చేయాలని కోరినా ఫలితం లేకుండా పోయింది. ఉత్తుత్తి హామీలతో సంవత్సరాల తరబడి ప్రజాప్రతినిధులు, అధికారులు కాలం గడపడంతో లబ్దిదారులు ఇళ్లను నిర్మించుకోలేకపోయారు. ఈ పరిస్థితుల్లో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం కోసం పట్టణ శివార్లలో పేదలకు కేటాయించిన తొమ్మిదిన్నర ఎకరాల స్థలం వెనక్కు తీసుకొంటామని మంత్రి ప్రకటించడంతో పేదలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ సహాయంతో ఎప్పటికైనా నీడ దొరుకుతుందని ఆశపడ్డ వారి కలలు కల్లలు కావడంతో

ఆత్మకూరు ప్రజలకు మంత్రి చేసిన సాయం

పేద కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో పడిపోయాయి. స్థలం కేటాయించేటపుడు శ్రద్ధపెట్టి వుంటే వీరందరికి ఇళ్లు ఏర్పడేవని, ఇప్పుడు ఇళ్ల స్థలాలు రద్దు చేస్తామని ప్రకటించడం ఎంతవరకు సమంజసం అని సిపిఎం నేతలు ప్రశ్నిస్తున్నారు. మొత్తం మీద మంత్రి ఆనం ప్రకటన ఆత్మకూరులో గందరగోళానికి దారి తీసింది.

కావలి ఆస్పత్రి బాగుపడేదెట్లా?

కావలి ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి శాసనసభ్యుడు బీద మస్తాన్‌రావు కృషి చేస్తున్నప్పటికీ సలహా మండలి సభ్యులు, అధికారులు కలసి రాకపోవడంతో ఒక అడుగు ముందుకు నాలుగడుగులు వెనక్కు అన్న చందంగా వుంది. ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ఆస్పత్రి అభివృద్ధికి బీద నడుంబిగించారు. ఆస్పత్రి సలహా మండలిలో పలువురు ప్రముఖులను సభ్యులుగా నియమించారు. అయితే సలహా మండలి సభ్యులలో అంకిత భావం కొరవడడంతో ఎమ్మెల్యే తాపత్రయ పడాల్సిందే తప్ప అభివృద్ధికి చేపడుతున్న చర్యలు శూన్యం కావడంతో నామ్‌కేవాస్తేగా తయారైంది సలహా మండలి. రోటరీ క్లబ్ అధ్యక్షులు సామంతు మస్తాన్‌రెడ్డితోపాటు 12మంది సభ్యులున్నారు. ఎమ్మెల్యే మస్తాన్ రావు వచ్చినప్పుడు సమావేశాలకు మొక్కుబడిగా హాజరుకావడం, ఆయన లేనప్పుడు ఆస్పత్రి ముఖం చూసేవారే లేకుండా పోవడంతో ఆస్పత్రిని అభివృద్ధి చేయాలన్న బీద చొరవకు సహకరించేవారు కరువవడంతో ఆస్పత్రి పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా వుంది. గతంలో ఆస్పత్రి ఆవరణంలోని దుకాణాల బాడుగ విషయంలో సభ్యులతో బీద కఠినంగా మాట్లాడి వుండడంతో వీరంతా లోపాయికారిగా ఎమ్మెల్యే వృతిరేకవర్గంతో చేతులు కలిపి కావాలని ఆస్పత్రిని భ్రష్టుపట్టించే పనిలో వున్నట్లు కావలిలో చర్చించుకొంటున్నారు.

శ్రద్ధ చూపని సలహా మండలి

వైఎస్ఆర్ పార్టీ సభ్యత్వనమోదు

వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆత్మకూరులో సెప్టెంబర్ 27వతేది ప్రారంభమైంది. ఆ పార్టీ నేత గుండాల మధుసూధన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయసాధన కోసం జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసే వరకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. ప్రభుత్వాలు ఎన్ని కుట్రలు చేసినా ప్రజల్లో జగన్‌కున్న అభిమానాన్ని ఎవరూ పొగొట్టలేరన్నారు. ప్రజల సమస్యలు, బాగోగులు పట్టించుకోని రాష్ట్రప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ పార్టీ నాయకులు ఇందూరు నరసింహారెడ్డి, దేవరపల్లి శ్రీనివాసులరెడ్డి, మమత, రహీం, మనోజ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● వెంకటగిరి రెవిన్యూపై

కలెక్టర్ ఆగ్రహం!

వెంకటగిరి ప్రాంతంలో భూఆక్రమణలు, బోగస్ పట్టాలు అధికంగా వున్నాయని, దీనివల్ల వివాదాలు ఎక్కువవు తున్నాయని ఇలాగే కొనసాగితే రెవెన్యూ పరంగా వెంకటగిరిని బ్లాక్ లిస్టులో పెడతామని జిల్లా కలెక్టర్ శ్రీధర్ హెచ్చరించారు. వెంకటగిరిలో జరిగిన రెవెన్యూ సదస్సుకు విచ్చేసిన ఆయన అధికారులకు తీవ్ర హెచ్చ రికలు చేశారు. భూ ఆక్రమణలకు పాల్పడుతుంటే అరికట్టాల్సిందిపోయి కళ్లు వుండి కబోదులుగా వ్యవహరిస్తున్నారని చురకలంటించిన కలెక్టర్ ఒళ్లు దగ్గర పెట్టుకొని ఉద్యోగం చేయండి లేదంటే అందరిని కట్టకట్టి ట్రాన్స్‌ఫర్ చేసేస్తానని హెచ్చరించడంతో అధికారులు కిక్కురుమనకుండా వుండిపోయారు. గ్రామాల్లో జెసిబిలు, ట్రాక్టర్లతో భూఆక్రమణలకు పాల్ప డుతుంటే వారిపై క్రిమినల్ కేసులు పెట్టండి, లేదంటే సంబంధిత అధి కారులపై క్రిమినల్ కేసుల నమోదు చేస్తామన్నారు. గ్రామ రెవెన్యూ సమ స్యపై వివరాలడగడంతో విఆర్ఓలు సమాధానం చెప్పలేక తెల్లమొహం

ఒళ్లు దగ్గర పెట్టుకొని ఉద్యోగం చేయమని సలహా

వేయడంతో కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పాత ఎంఆర్ఓల సంతకాలతో రికార్డులు, పట్టాలు వున్నట్లు సమాచారం వుంది. అలాంటి వారి ఇళ్ల మీద చట్టపరంగా దాడులు చేస్తామన్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యా లయంలోనూ తహశీల్దార్ ఇచ్చిన సర్టిఫికేట్ ఆధారంగా తప్పుడు రిజి స్ట్రేషన్లు జరుగుతున్నాయని అలాంటివి చెల్లవన్నారు. అటవీ, పోరంబోకు భూమిని సాగు చేసుకొనే రైతుల నుంచి అర్జీలు స్వీకరించినట్లయితే వాటిని పరిశీలన నిమిత్తం ప్రభుత్వానికి పంపుతామన్నారు. ఈ సంద ర్భంగా డక్కిలి మండలం తీర్థంపాడుకు చెందిన అంధ బాలిక పదవ తరగతి ఉత్తీర్ణత పొందానని పై చదువులకు సహాయం చేయాలని కోరగా తిరుపతిలోని అంధ కళాశాలలో చేర్పిస్తామని, ప్రభుత్వమే ఖర్చు భరిం చేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ సదస్సులో జాయింట్ కలెక్టర్ సౌరభ్‌గౌర్, అదనపు జెసి లక్ష్మీకాంతం, గూడూరు సబ్ కలెక్టర్ వీర పాండ్యన్ తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న

విద్రోహశక్తులు!

మనీ చైన్‌లింక్ స్కీంలలో పెట్టుబడి పెట్టి నష్టపోయిన బాధితులు లబోదిబో మంటూ పోలీసుల చుట్టూ న్యాయం కోసం తిరుగు తుంటే, ఇదే అదనుగా భావించి దొంగలు, రౌడీలు రంగప్రవేశం చేయడంతో పలు ప్రాంతాల్లో ఈ వ్యవ హారం గగ్గోలురేపుతోంది. వివిధ సంస్థల తరపున ఏజెంట్లుగా పని చేసిన వారిని పట్టుకొని పోలీసులు ఒక వైపు విచారిస్తుండగా, మరోవైపు రౌడీమూకలు, దొంగల ముఠాలు పెద్దఎత్తున ప్రజల నుంచి డబ్బులు కట్టించిన ఏజెంట్ల మీద దాడులకు దిగడం, బెదరింపు లకు పాల్పడుతుండడంతో వ్యవహారం కట్టుతప్పు తోంది. కావలి ప్రాంతంలో ఇలాంటివి అధికంగా జరుగుతున్నాయి. డబ్బులు కట్టి నగదు పొగొట్టుకొన్న బాధితులకంటే కూడా అధికంగా దీంతో ఏ సంబం ధం లేని రౌడీలు, అల్లరిచిల్లరి మూకలు చేస్తున్న దౌర్జన్యాలు అధికం కావడంతో అటు పోలీసులు, ఇటు బాధితుల నడుమ రౌడీ మూకల దెబ్బకు హడలి పోతున్నారు. రౌడీల ఆగడాలు అధికం కావడంతో ఆ ఒత్తిడి తట్టుకోలేక దగదర్తి మండలంలో ఒక ఏజెంటు, అల్లూరులో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకొన్నారు. పోలీ సుల కంటే అధికంగా రౌడీలు బృందాలుగా ఏర్పడి ఏజెంట్ల ఇళ్లపై దాడులు చేస్తుండడంతో ఆయా కుటుంబాలు భయభ్రాంతులకు గురౌతున్నాయి. పోలీ సులు ఇలాంటి ముఠాలపై నిఘా వుంచి అణచి వేయకపోతే అసలు బాధితులకు న్యాయం జరగని పరిస్థితి ఎదురౌ తుంది.

ట్రామాకేర్ సెంటర్ పనుల్లో నాణ్యతేది?

నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేస్తున్న ట్రామాకేర్ సెంటర్ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తోంది. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వ్యవహ రిస్తూ నాణ్యతకు తిలోదకాలిస్తున్నారు. కోట్లాది రూపా యల నిధులతో నిర్మిస్తున్న ఈ భవన నిర్మాణ పనుల్లో అడుగడుగునా అవినీతి, అక్రమాలు చోటు చేసుకొం టున్నాయి. 4.80కోట్ల రూపాయల నిధులతో ఏర్పా టవుతున్న ఈ సెంటర్‌లో 65లక్షల రూపాయలు భవన నిర్మాణానికి వెచ్చించి మిగిలిన మొత్తం మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగిస్తారు. నిర్మాణ పనుల్లో సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు లేక పోవడం, పర్యవేక్షణను గాలికి వదిలేయడంతో కాం ట్రాక్టర్ అడుగడుగునా అవినీతికి పాల్పడుతూ పరమ నాసిరకంగా పనులు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. గుంటలు త్రవ్వి బెల్టు కోసం కాంక్రీట్ వేయగా రాళ్లుతప్ప ఎక్కడా సిమెంట్ కన్పించడం లేదు.

ఇష్టానుసారంగా పని చేస్తున్న కాంట్రాక్టర్

ప్రమాదంలో గాయపడి ప్రాణాలు పోయేస్థితిలో వుండేవారిని ఆదుకొనేందుకు ఏర్పాటవుతున్న ట్రామా కేర్ సెంటర్ నిర్మాణ పనులను నాణ్యతతో జరిగేలా చూడాల్సిన అధికారులు బాధ్యత మరచి ప్రవర్తించ డంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గూడూరులో జండా పండుగ ఘనం

గూడూరు పట్టణంలో ప్రతి ఏటా ప్రతిష్టా త్మకంగా నిర్వహించే జెండా పండుగను ఈ సంవత్సరం సెప్టెంబర్ 27వతేది ఘనంగా నిర్వ హించారు. రంగు రంగుల గుడ్డలపై ఆంజనేయ స్వామి చిత్రాలను వివిధ రూపాల్లో చిత్రించి వాటిని ఊరేగించడం ఆనవాయితి. దీని కోసం లక్షల రూపా యలు ఒక్క జెండాకు ఖర్చుపెడతారు నిర్వాహకులు. తూర్పు గోదావరి జిల్లా కళాకారుడు కళాధర్, గూడూరుకు చెందిన చిత్రకారుడు వరదారెడ్డిలు ఆంజనేయ స్వామి చిత్రాలను వేశారు. దాదాపు 50జెండాలు ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి జెండాపండుగను తిలకించేందుకు పెద్ద సం ఖ్యలో భక్తులు తరలిరావడంతో పట్టణం కిటకిట లాడింది. తూర్పువీధి, కర్నాలవీధి, గుమ్మళ్లపాళెం, కోనేటిమిట్ట, నలజాలమ్మవీధి, కారుస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన భారీ కటౌట్లు, విద్యుత్ దీపాలంకరణలు ప్రజలను ఆకట్టుకొన్నాయి. ప్రత్యే

పోటా పోటీగా ఉత్సవం

కించి తూర్పువీధి ఆంజనేయస్వామి జెండా నిర్వా హకులు ఏర్పాటు చేసిన లేజర్ షోకు అనుగుణంగా పలువురు నృత్యం చేశారు. గరగ నృత్యాలు, బుట్ట బొమ్మలాట, కోయ డ్యాన్సు, రాజస్థాన్ డోళ్లు, నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



అమెరికాలో తెలుగువారి జీవన స్థితిగతులు పరిశీలనకు ఆరు నెలలపాటు పర్యటించి నెల్లూరు వచ్చిన ప్రపంచ తెలుగు సమాఖ్య రీజినల్ ఛైర్మన్ బలరామయ్య నాయుడిని సన్మానిస్తున్న హజరత్‌బాబు, బివి.నరసింహం, బి.సుందరరామిరెడ్డి, డాక్టర్ అంకిరెడ్డి.



రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని నెల్లూరులో ప్రదర్శన చేస్తున్న బాలాజీ బ్లడ్ డోనర్స్ ఆర్గనైజేషన్ సభ్యులు.

నూతన ప్రారంభం
అక్టోబర్ 6 గురువారం, 2011
ఉదయం 11 గం॥లకు

శ్రేయోభిలాషులందరికీ
హృదయపూర్వక ఆహ్వానం

సింహపురికే తలమానికంగా
అధునాతన వసతులు...
* అన్ని ఫ్లోర్‌లు సెంట్రలైజ్డ్ ఎ.సి.,
* 2 కాన్ఫరెన్స్ హాల్స్,
* 40 ఎ.సి. రూమ్‌లు,
* 700కు పైగా సీటింగ్ కెపాసిటీ,
* విశాలమైన పార్కింగ్.



శ్రీ కిలారి తిరుపతి నాయుడు కళ్యాణ మండపం A/c
AC సుబ్బారెడ్డి స్టేడియం ప్రక్కన, జి.ఎన్.టి. రోడ్, నెల్లూరు.

కళ్యాణ మండపం ప్రారంభకులు | భవన ప్రారంభకులు | ముఖ్య అతిథులు



శ్రీ ఆనం రాంనారాయణ రెడ్డి
రాష్ట్ర ఆర్థికశాఖమాత్యులు

శ్రీ ఆనం వివేకానంద రెడ్డి
నెల్లూరు రూరల్ శాసనసభ్యులు

శ్రీ ఎం. శ్రీధర్ కృష్ణారెడ్డి
నెల్లూరు నగర శాసనసభ్యులు

శ్రీమతి ఎన్. భానుశ్రీ
మాజీ మేయర్, నెల్లూరు.

కిలారి తిరుపతి నాయుడు ***** మీ... కిలారి జగదీష్

అధిష్టానం ఎత్తుకు తెలంగాణ కాంగ్రెస్ చిత్తు



కాంగ్రెస్ పార్టీ అధిష్టానం వేసిన ఎత్తుకు తెలంగాణ కాంగ్రెస్ నాయకులకు ఊపిరి సలపటం లేదు. ప్రత్యేక రాష్ట్రం ప్రకటించాలంటే ముందుగా టిఆర్ఎస్ కాంగ్రెస్‌లోకి విలీనం కావాలి. ఆ పని మీరే చేయాలంటూ అధిష్టానం తెలంగాణ కాంగ్రెస్ నాయకులను కోరిందట. దీంతో ఏం చేయాలో పాలుబోక తెలంగాణ కాంగ్రెస్ నాయకులు కెసిఆర్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎలాగూ తెలంగాణ ఇవ్వడానికి కాంగ్రెస్ సుముఖంగా వున్న దృష్ట్యా టిఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లోకి విలీనం చేయాలని కాంగ్రెస్ నాయకులు జానారెడ్డి నాయకత్వంలో కెసిఆర్‌పై ఒత్తిడి తెస్తున్నారు. అయితే కెసిఆర్ మాత్రం ఈ ప్రతిపాదనను అంగీకరించడం లేదు. ముందుగా తెలంగాణ ప్రకటించమనండి... ఆ తర్వాత విలీనం గురించి ఆలోచిస్తామంటూ కెసిఆర్ చెబుతున్నాడు. దీంతో ముందు నుయ్యి – వెనుక గొయ్యి అన్నట్లుగా తయారైంది కాంగ్రెస్ నాయకుల పరిస్థితి. టిఆర్ఎస్ విలీనం ప్రతిపాదనను తెలంగాణ నాయకుల భుజాలపై పెట్టి కాంగ్రెస్ సొంత పార్టీలో ఒత్తిడిని తగ్గించుకుందని టిఆర్ఎస్ వర్గాలు అంటున్నాయి. తెలంగాణ ముందా? విలీనం ముందా అంటే ఎలా? చెట్టుముందా? విత్తు ముందా? అంటే ఏం చెబుతాం అంటూ జానారెడ్డి కనబడిన వాళ్లం దరితో చెప్పుకొని బాధపడుతున్నాడట. పాపం జానా!

కిలో రూపాయి బియ్యం 'క్లిక్' అవుతుందా?




రాష్ట్రంలో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితుల్లో నుంచి కిలో రూపాయి బియ్యం గట్టెక్కిస్తుందని ముఖ్యమంత్రి కిరణ్‌రెడ్డి గంపెడాశలు పెట్టుకున్నాడు. వచ్చేనెల ఒకటవ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఈ పథకం వల్ల బీదా బిక్కి జనం తనకు మద్దతు తెలుపుతారని కిరణ్‌రెడ్డి భావిస్తున్నాడు. గతంలో ఎన్టీఆర్ రెండు రూపాయలకు కిలోబియ్యం పథకం ప్రారంభించినప్పుడు కూడా తెలుగు దేశం ప్రభుత్వానికి ప్రజల నుంచి గట్టి మద్దత్తు లభించింది. అలాగే తన పథకానికి కూడా అంతకంటే మించిన మద్దత్తు లభిస్తుందని కిరణ్‌రెడ్డి కొండంత నమ్మకంతో వున్నాడు. బహిరంగ మార్కెట్‌లో కిలో బియ్యం 25రూపాయల దాకా వుంది. కిలో రూపాయికే ఇవ్వడం వల్ల పేదప్రజానీకం ఎంతో లబ్ధి పొందుతారన్నది కిరణ్‌రెడ్డి అభిప్రాయం. అయితే ఇతర నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో కేవలం బియ్యం ఇచ్చినంత మాత్రాన పేదలకు జరిగే మేలు ఏదీ లేదంటూ ప్రతిపక్షపార్టీలు కిరణ్‌రెడ్డి ప్రయత్నానికి మోకాలడ్డుతున్నాయి. చూద్దాం... కిలో బియ్యం రూపాయి పథకం క్లిక్ అవుతుందో! లేదో?

చంద్రబాబు గందరగోళం




తెలంగాణ, సమైక్యాంధ్ర అన్న విషయంలో ఇప్పటికీ చంద్రబాబు సందిగ్ధంగానే వుండటం ఆ పార్టీ వర్గాలకు తలనొప్పిగా మారింది. తెలుగుదేశం పార్టీ అటు సీమాంధ్రలోనూ... ఇటు తెలంగాణలోనూ బలంగా వుంది. అటువంటప్పుడు ఒక ప్రాంతం పట్ల మొగ్గు చూపడం కుదరదని తాజాగా 'బాబు' ప్రకటించాడు. ఏ ప్రాంతంలోని వారు ఆ ప్రాంతం వారి మనోభావాలకు అనుగుణంగా పనిచేస్తారని బాబు చెప్పడం పార్టీ వర్గాల్లో గందరగోళానికి దారి తీసింది. బాబు నిర్ణయం వల్ల రెండు ప్రాంతాల ప్రజలు కూడా తెలుగుదేశంను నమ్మరని పార్టీ వర్గాలు తలలు పట్టుకుంటున్నాయి. అయితే చంద్రబాబు మాత్రం తను పట్టిన కుందేటికి మూడే కాళ్లు అన్నట్లు ధృడంగా వున్నాడు. ఇప్పటికే తెలంగాణలో నాగం సొంత కుంపటి పెట్టుకున్నాడు. పలువురు ఎమ్మెల్యేలు 'గులాబీ' మార్గం పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో కూడా ప్రత్యేక తెలంగాణ పట్ల చంద్రబాబు సీరియస్‌గా ఆలోచించకపోవడం పార్టీకి నష్టమని దయాకర్‌రావు లాంటి తెలంగాణ నాయకులంటున్నారు. అన్ని విషయాల్లో తేలిగ్గా చక్రం తిప్పే చంద్రబాబు తెలంగాణ విషయంలో మాత్రం ఉదాసీనంగా వుండటం పట్ల పార్టీ వర్గాలు పెదవి విరుస్తున్నాయి.

ఓ మంత్రి వద్దన్నారు... మరో మంత్రి కావాలన్నారు




రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా వున్న బాలసుబ్రహ్మణ్యంను రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్‌గా బదలీ చేస్తున్నారు. ఓ ఐఎఎస్ అధికారి బదలీ మూమూలు వ్యవహారమే అయినా... ఈ బదలీలో మాత్రం మతలబు వుంది. గిడ్డంగులశాఖ మంత్రి ముఖేష్‌గౌడ్‌కు చాలాకాలం నుంచి బాలసుబ్రహ్మణ్యం పనితీరు నచ్చడం లేదు. తాను చెప్పిన పనులు ఏమీ చేయడం లేదన్నది మంత్రిగారి బాధ. అయితే బాలసుబ్రహ్మణ్యం ఈ సంస్థకు వచ్చాక గణనీయమైన అభివృద్ధి కనిపిస్తోంది. కొంతకాలంగా తన సంస్థ ఎండీని బదలీ చేయాలంటూ గౌడ్ ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెస్తున్నాడు. అయితే బాలసుబ్రహ్మణ్యంను తన మంత్రిత్వ శాఖకు బదలీ చేయాలంటూ ఉప ముఖ్యమంత్రి రాజనర్సింహ ముఖ్యమంత్రిని కోరుతున్నారు. గతంలో పాఠశాల విద్యాశాఖ మంత్రిగా వుండగా బాలసుబ్రహ్మణ్యం ఆయన దగ్గర పని చేశారట. సమర్థుడైన అధికారిగా బాలసుబ్రహ్మణ్యం విద్యాశాఖను తీర్చిదిద్దారన్నది రాజనర్సింహ అభిప్రాయం. ముఖ్యమంత్రి కూడా ఒకే దెబ్బకు రెండు పిట్టలన్న సామెతలాగా గౌడ్ కోరికపై బాలసుబ్రహ్మణ్యంను సాంకేతిక విద్యాశాఖకు బదలీ చేయాలని నిర్ణయించాడట.





నెల్లూరు రిలయన్స్ సూపర్‌మార్కెట్ పైన కొత్తగా కట్టిన హోటల్ అతిథిని ప్రారంభిస్తున్న తమిళనాడు గవర్నర్ కె.రోశయ్య. ప్రక్కన మంత్రి రామనారాయణరెడ్డి, ఎమ్పీ శ్రీనివాసులురెడ్డి, హోటల్ అధినేత సురేష్ తదితరులు.



నెల్లూరు ఇస్కాన్ మందిరంలో గోశాలతోపాటు సమావేశ మందిరం నిర్మాణానికి ఎనిమిది లక్షల రూపాయల విరాళాన్ని నిర్వాహకుడు సుఖదేవస్వామికి అందిస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి.



వరికుంటపాడులో ఇందిర జలప్రభ పథకాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పితాని సత్యనారాయణ.



స్త్రీలు సౌభాగ్యం కోసం చేసే వ్రతం అట్ల తద్ది!

త్రిలోక సంచారి అయిన నారదుని ప్రోద్బలంతో గౌరీదేవి శివుని పతిగా పొందగోరి తొలుతగా చేసిన విశిష్టమైన వ్రతమే అట్లతద్ది. స్త్రీలు సౌభాగ్యం కోసం చేసుకొనే వ్రతం కూడా ఇది. ఇందులో చంద్రారాధన ప్రధానమైన పూజ. ఈ పండుగను అట్లతద్ది అని అట్ల తదియ అని పిలుస్తారు. అశ్వీయుజ బహుళ తదియనాడు జరుపుకొనే ఈ అట్లతద్ది పండుగ తెలుగు వారికి ఎంతో ప్రీతిపాత్రమైనది. అట్ల తద్దె ఆరట్లు, ముద్దపప్పు మూడట్లు అంటూ ఆడపడుచులు ఆనందోత్సాహాలతో చేసుకొనే ఈ పండుగ ఈ యేడాది అక్టోబర్ 14వ తేది వస్తుంది.

పరమేశ్వరుడిని భర్తగా పొందాలని పార్వతి తపమాచరించదలచిన సందర్భంలో నారద మహర్షి ఆమెకు ఈ వ్రతం గురించి తెలిపి దానిని చేయమని చెప్పగా నారదుని సలహాను అనుసరించి అట్లతద్దె వ్రతాన్ని ఆచరిస్తుంది. దీని ఫలితంగా ఆమె అభీష్టం మేరకు శివుడు ప్రత్యక్షమై అనుగ్రహించినందున బహుళ తదియనాడు ఈ వ్రతాన్ని చేసినట్లయితే కోరిన కోర్కెలు తీరుతాయని, సకల శుభాలు కల్గుతాయని పురాణాలు పేర్కొంటున్నాయి. అందుకే ఈ పండుగకు ఉమా వ్రతం అని కూడా పేరొచ్చింది.

పండుగనాడు వ్రతమాచరించదలచిన స్త్రీలు పొద్దునే లేచి శుచి, శుభ్రంగా స్నానమాచరించి ఇంటిలో తూర్పుదిక్కున మండపం ఏర్పాటు చేసి అందులో గౌరీదేవి ప్రతిమను వుంచాలి. ధూపదీప నైవేద్యాలు పెట్టి ముందుగా విఘ్నేశ్వరుని పూజించి, ఆ తర్వాత గౌరీదేవిని అర్చించాలి. స్తోత్రము పఠించి నైవేద్యం సమర్పించాలి. తిరిగి సాయంత్రం వేళలోనూ చంద్ర దర్శనం అనంతరం గౌరీపూజ చేసి 10 అట్లు నైవేద్యంగా పెట్టాలి. చంద్రారాధన ఫలితంగా చంద్రకళల్లో కొలువైన శక్తి అనుగ్రహం చేత కుటుంబంలో సుఖశాంతులు వర్థిల్లుతాయని, సకల శుభాలు కల్గుతాయని శాస్త్రవచనం. ఈ పండుగలో అమ్మవారికి అట్లు నైవేద్యంగా పెట్టడంలో ఒక అంతరార్థం వుంది. నవగ్రహాలలో కుజుడుకి అట్లంటే ప్రీతి, అందువలన అట్లను నైవేద్యంగా పెట్టడం వలన కుజదోష పరిహారమై అన్ని అడ్డంకులు తొలుగుతాయని నమ్మకం. అలాగే మినుములు, బియ్యపు పిండి కలిపి తయారు చేసే అట్లలో మినుములు రాహువుకు, బియ్యం చంద్రుడికి సంబంధించిన ధాన్యాలు. అలాంటి అట్లను వాయనంగా ఇవ్వడం వలన స్త్రీలకు గర్భదోషాలు తొలుగుతాయని చెప్తారు. అట్లతద్ది పండుగలో వాయనంగా ఇచ్చే అట్లకు అంతటి వైద్య విజ్ఞానము నిక్షిప్తం చేయబడి వుంది. పండుగ రోజున పూజ చేయడమేకాక స్త్రీలు తోటివారితో కలిసి ఊయాలలూగి ఆనందోత్సాహాలతో గడుపుతారు. అందుకే దీనికి ఉయ్యాల పండుగ అనీ పేరుంది. ఈ అట్లతద్ది పండుగను ఉత్తర భారతదేశంలో కర్వాచౌత్ అనే పేరుతో జరుపుకొంటారు.


ట్రంకురోడ్డు

అరే... ఆక్రమించండి!



అయ్యోరుగా అందరు ముద్దుగా పిలుచుకొనే నెల్లూరు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు చాట్ల నరసింహారావు తేనె పూసిన కత్తిలాంటి నాయకుడు. ఆయన్ను డిసిసి అధ్యక్షుడిని చేయాలని ఆనం బ్రదర్స్ గట్టి ప్రయత్నమే చేసినా ఫలితం దక్క లేదు. ఈ మధ్య తన దగ్గరకు చిన్నాచితకా పనులపై వస్తున్న పార్టీ కార్యకర్తలు ఆయన చేస్తున్న 'దురాక్రమణ బోధ' విని విస్తుపోతున్నారు. చిన్న చితకా పనులతో మీరు జీవితంలో స్థిరపడలేరు. ఎక్కడైనా స్థలాలుంటే చూసి ఆక్రమించుకోండి. నేను సహకారమందిస్తాను. వెంటనే మసిపూసి మారేడు కాయ చేసి వాటిని అమ్మేస్తే లక్షలు మిగులుతాయని చెబుతున్న సలహా విని కార్యకర్తలు తలలు పట్టుకొంటున్నారు. ఎమ్మెల్యే వివేకానందరెడ్డితో రాసుకపూసుకొని తిరిగే చాట్లకు ఈ దుర్మార్గపు ఆలోచనలు వస్తున్నాయంటూ ఎసి, మూలపేట సెంటర్లలో టాక్.

బ్లాక్ టిక్కెట్లే శరణ్యం!




నెల్లూరు నగరం ఒకప్పుడు సినిమా హాళ్లకు ప్రసిద్ధి. 23 సినిమాహాళ్లు జనంతో క్రిక్కిరిసి నడిచేవి. సిడి, డివిడిల రాక హాళ్లను దెబ్బతీయడం, కొన్ని హాళ్లు ఆధునీకరిస్తుండడంతో ఇప్పుడు 10 హాళ్లు మాత్రమే నడుస్తున్నాయి. వీటిలో సినిమా చూసేందుకు అనుకూలంగా వుండే హాళ్లు ఎనిమిది మాత్రమే. కొత్త సినిమాలు బాగున్న నాలుగు థియేటర్లలోనే విడుదలవుతుండడంతో టిక్కెట్లకు యమ గిరాకీ ఏర్పడుతోంది. హాళ్ల యాజమాన్యాల ప్రమేయం వుందో లేదో తెలియదు కాని సిబ్బందే మొదటి మూడురోజుల టిక్కెట్లు బ్లాక్ చేసి అమ్ముతున్నారు. దూకుడు సినిమా టిక్కెట్ మొదటి రోజు 600 రూపాయలు పలుకగా, డబ్బింగ్ సినిమాలు గ్యాంబ్లర్, వచ్చాడు... గెలిచాడు వంటి సినిమా టిక్కెట్లు 150 రూపాయలు, చిన్న సినిమా మడతకాజా టిక్కెట్ 120 రూపాయలకు అమ్ముకొని సొమ్ము చేసుకొంటున్నారు. పోలీసులకు మామూళ్లు ఇస్తుండడంతో బహిరంగంగానే బ్లాక్ టిక్కెట్లు అమ్ముతున్నా పట్టించుకొనే నాధుడు లేడని సామాన్య ప్రేక్షకుడు శాపనార్థాలు పెడుతున్నారు. ప్రేక్షకుల శాపనార్థాలకు హాళ్లు కూలవుగా?



పుష్ప విలాపం

జంధ్యాల పాపయ్యశాస్త్రి వ్రాసిన పుష్ప విలాపాన్ని మధుర గాయకుడు ఘంటసాల గాత్రంలో వింటుంటే కరుగని మనసుండదు. అయినాసరే పుష్పాలు ఇంతుల జడలకు సొగసులు సమకూర్చను, పండుగలు పబ్బాల్లో దేవతా విగ్రహాలు కాంతులీనేలా చేయను విరగపూస్తుంటాయి. ఎంతగా పుష్పించినా పూల మార్కెట్‌లోనూ స్పెక్యులేషన్ మూలంగా ఈ దసరాలో పూలరేట్లు విపరీతంగా పెరిగిపోయాయి. దసరా ప్రారంభమయ్యే ముందురోజుకు మూర ఐదు రూపాయలున్న మల్లెలు ఇప్పుడు 15 రూపాయలవగా సెంటుజాజులు ఐదెక్కువ పలుకుతున్నాయి. ఎర్రజాజులు ఏకంగా 35 రూపాయలయ్యాయి. ఐదు రూపాయలకన్నా తక్కువకు దొరికే కదంబం కూడా మూర పదిరూపాయలయ్యింది. కనకాంబరాల సంగతి చెప్పబని లేదు. ఈ పండుగ వెళ్లే వరకు ఇంతుల కొప్పులు చిటికెడు పూలతోనే సింగారక తప్పేట్లు లేదు.

నెల్లూరులో నల్లులు



ఒకప్పుడు నల్లుల బెడదలేని ఇల్లు వుండేది కాదు. ఎండ్రిన్ తోపాటు ఇతర కీటక నాశనులు అందుబాటులోకి రావడంతో ఇళ్లలో నల్లుల బాధ బాగా తగ్గింది. నల్లుల సంతతి నశించిపోయిందని ప్రకటించిన ఆరోగ్యశాఖాధికారులకు సవాల్ విసురుతూ నెల్లూరులో పేరుగడించిన రాధా – మాధవ్ థియేటర్ల యాజమాన్యం తమ హాళ్లలోని సీట్లలో వీటిని జాగ్రత్తగా పెంచి పోషిస్తోంది. అరవై రూపాయలు టిక్కెట్ పెట్టి సినిమాకు వెళ్లిన ప్రేక్షకులకు నరకం చూపిస్తున్నారు ఈ హాళ్ల యాజమాన్యాలు. ఈ హాళ్లలో ఎసి వేయరు, వేసిన ఫ్యాన్లు గాలి ప్రేక్షకులందరికీ రాదు. సీట్ల క్రింద తినుబండారాల చెత్త, పడేసిన తినుబండారాల కవర్ల కోసం ప్రేక్షకుల కాళ్ల గోకే మూషికాలు, ప్రేక్షకులు ప్రశాంతంగా కూర్చొని సినిమా చూడనివ్వని నల్లులు. హాళ్ల నిర్వహించడమే కాదు యాజమానులు కూడా అప్పుడప్పుడు తమ హాళ్లకు వచ్చి సీట్లలో కూర్చొని సినిమాలు చూడాలని ట్రంకురోడ్డులో ప్రేక్షకులు నసుగుతున్నారు.

గప్‌చిప్



నెల్లూరు నేతల మధ్య అప్పుడప్పుడు విమర్శలు, ప్రతివిమర్శలు తారాస్థాయికి చేరుతాయి. వీటిని పత్రికలు, టీవీల్లో చూసిన జనం మున్ముందు ఏం జరుగుతుందోనని ఆందోళనపడతారు. కాని చివరికి అంతా గప్... చిప్పే. ఈ మధ్య ఆత్మకూరు మాజీఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడు, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణల మధ్య మహా సంవాదాలు జరిగాయి. రామకృష్ణ రాసలీలు బయటపెడతానని కొమ్మి ప్రకటించగా, కొమ్మి ఇంజనీరింగ్ కాలేజి కొనుగోళ్ల పత్రాలు ప్రదర్శిస్తానని కురుగొండ్ల చెప్పారు. ఈ గొడవ జనం మరవక ముందే నేతలిద్దరూ తమ కుల సంఘం సమావేశంలో చెట్టాపట్టాలేసుకోవడం చూసి ఆశ్చర్యపోవడం జనం వంతయ్యింది.



మేషం
అశ్వని, భరణి, కృత్తిక 1 పా

వాహన ప్రమాదాల సూచన. సోదరులతో అభిప్రాయభేదావకాశాలు. అధికారులతో జాగ్రత్త. వ్యాపారులకు గడచిన వారంలో ఏర్పడ్డ నష్టాలను ఈవారంలో పూడ్చుకో వీలవుతుంది. విద్యార్థులకు ఒకవిధంగా చదువు సాగుతుంది. ఇంటిలో వివాహసంబంధ విషయాలు ప్రస్తావనకు వస్తాయి. రాజకీయులకు కొంత మేలు. ప్రతి అడుగు ఆచితూచి వేయాలి. ఉద్యోగులకు గొడవలతో సాగుతుంది.



వృషభం
కృత్తిక 2,3,4 పా. రోహిణి, మృగశిర 1,2 పా

సాధారణంగా గడచిపోతుంది. ఆర్థిక విషయాలు చక్కగా వున్నాయి. అధికారుల ప్రాపు చక్కగా వున్నా, శ్రమ అధికం. సోదరులకు ఇబ్బందులుండవచ్చు. గృహాలంకరణ విషయాలలో ఆసక్తి చూపుతారు. కళత్ర సంబంధం దెబ్బతినవచ్చు. ఖర్చుకు వెరవరు. ప్రతి పనిలో దూకుడు తగ్గించుకోవాలి. విద్యార్థులకు ప్రయోజనవంతమైన కాలం. వ్యాపారులకు అత్యంతం చక్కని కాలం.



మిథునం
మృగశిర 3,4 పా. ఆర్ద్ర,పునర్వసు,1,2,3 పా

పనులు నిలిచి నిదానంగా సాగుతాయి. సద్వార్తా శ్రవణం. మిత్రుల మూలంగా సహాయ సహకారాలు. సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. ధనవిషయాలలో లోటు లేదు. వివిధమార్గాలలో ధన ప్రాప్తి అవకాశాలు. ఇతరులతో అభిప్రాయభేదాలు రావచ్చు. మాతృ ఆరోగ్యం ఆందోళనకరం. మాట నిలబెట్టుకోవడానికి శ్రమపడతారు. రాజకీయులకు ఉత్తమకాలం. వ్యాపారులకు మంచి లాభావకాశాలు.



కర్కాటకం
పునర్వసు 4 పా. పుష్యమి, ఆశ్లేష

ప్రతి అడుగు ఆచితూచి వేయడం మంచిది. నూతన గృహోపకరణాలు, ఆభరణాలు కొంటారు. గృహనిర్మాణాదులు ఊపందుకొంటాయి. చిన్న చిన్న జబ్బులు బాధిస్తూనే వుంటాయి. వ్యాపారులు భాగస్వాములతో సఖ్యంగా వుండడానికి ప్రయత్నించండి. కఠినంగా మాట్లాడవద్దు. రాజకీయులు తోటివారి విషయంలో జాగ్రత్తగా వుండాలి. విద్యార్థులు శ్రద్ధాసక్తులు పెంచుకోవాలి.



సింహం
మఖ, పుబ్బ ఉత్తర 1 పా

ఊహా ప్రపంచంలో విహరించవద్దు. ప్రయాణాలలో జాగ్రత్త అవసరం. ముందుచూపుతో అడుగేయాలి. ఇరుగుపొరుగువారితో జాగ్రత్త. ఆర్థిక విషయాలు కొంత ప్రోత్సాహకరంగా వుంటాయి. వ్యాపారులు ఖాతాదారులతో జాగ్రత్తగా మెలగాలి. గడచినవారం కన్నా కొంత మేలు. రాజకీయులకు తీరని వేదన చోటుచేసుకొంటుంది. ఎదురు చూచిన సత్ఫలితాలు దక్కవు.



కన్య
ఉత్తర 2,3,4పా, హస్త, చిత్తా 1, 2 పా

దూరప్రయాణావకాశాలు. వ్యాపారులకు గడచిన వారం కన్నా మేలు. ఖాతాదారుల మనసెరిగి నడచుకోవడం మంచిది. భాగస్వాములతో మాట పట్టింపులు వద్దు. రాజకీయులు లేనిపోని గొడవల్లో చిక్కుకొంటారు. ఆచి తూచి అడుగేయాలి. ఉద్యోగులకు శ్రమ అధికం. పనిలో అశ్రద్ధ పనికి రాదు. అధికారులతో వారి మిత్రులతో మంచిగా నడచుకోవాలి. కళాకారులకు ప్రోత్సాహం తక్కువ.

వారఫలాలు

తేది 08-10-2011 నుండి 14-10-2011 వరకు కన్యల్లో రవి, శనులు; కన్య, తులల్లో బుధుడు; తులలో శుక్రుడు; మేషంలో గురువు; కర్కాటకంలో కుజుడు; వృషభంలో కేతువు; వృశ్చికంలో రాహువు; కుంభ, మీన, మేషాల్లో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం

11 తేది వాల్మీకి జయంతి. 14తేది అట్ల తద్ది.

శుభ ముహూర్తాలు

10, 12తేదీలలో మిథున లగ్నాన
రా.11.00 నుండి 01.00 గంట వరకు.
8, 11, 12తేదీలలో సింహ లగ్నాన
తె.03.30 నుండి 05.00 గంటల వరకు.
9, 13తేదీలలో తులా లగ్నాన
ఉ.08.00 నుండి 10.00 గంటల వరకు.
12, 13తేదీలలో మేష లగ్నాన రా.07.00 నుండి 08.00 గంటల వరకు
సాధారణ శుభముహూర్తాలున్నాయి.

సెప్టెంబర్ తిథులు


ఆశ్వయుజ శుద్ధ

8	శని	ద్వాదశి	రా 01.22 గం.ల.వ
9	ఆది	త్రయోదశి	రా 02.34 గం.ల.వ
10	సోమ	చతుర్దశి	తె 04.14 గం.ల.వ
11	మంగళ	పౌర్ణమి	పూర్తిగా
12	బుధ	పౌర్ణమి	ఉ 06.22 గం.ల.వ

ఆశ్వయుజ బహుళ

13	గురు	పాడ్యమి	ఉ 08.27 గం.ల.వ
14	శుక్ర	విదియ	ఉ 10.30 గం.ల.వ

పి.ఎం.గోపాలాచారి
16/1020, పొగతోట, నెల్లూరు – 1.
E-mail:maripmgg@yahoo.com



తుల
చిత్తా 3,4 పా, స్వాతి, విశాఖ 1,2,3 పా

నూతన వస్త్రాభరణ ప్రాప్తి. ప్రయాణాలు సఫలమవుతాయి. అనుకొన్న పనులు అనుకొన్నరీతిలో సాగుతాయి. సంతానమూలంగా సుఖ శాంతులు లభిస్తాయి. వారి విద్యారంగం ప్రోత్సాహకరంగా వుంటుంది. ధనవిషయంలో లోటుండదు. భవిష్యత్తుకు మంచి పథకాలు వేస్తారు. రాజకీయులకు అనుకూలమైన కాలం. ఊహలు సానుకూలమవుతాయి. సమాజంలో మంచి ప్రతిష్ఠ పెరుగుతుంది.



వృశ్చికం
విశాఖ 4 పా, అనూరాధ, జేష్ఠ

ప్రతి పని నిలిచి నిదానంగా చేయడం మంచిది. వృత్తిలో మార్పు చేర్పులుండవచ్చు. వ్యాపారులకు భాగస్వాములతో జాగ్రత్త అవసరం. దైనందిన కార్యక్రమాలలో ఆటంకాలుండవచ్చు. విద్యార్థులకు ఒకమోస్తరుగా చదువు సాగుతుంది. కళాకారులకు ఆశాభంగం. రాజకీయులు పైవారి ప్రాపు పొందడానికి మంచి సమయం. ఉద్యోగులకు శ్రమాధిక్యత ఉంటుంది. శ్రమతోనే సాగుతుంది.




ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా

ఉద్యోగవృద్ధి, వేతనవృద్ధి వుంటుంది. చిరకాలంగా ఎదురు చూస్తూ వచ్చిన శుభఫలితాలు అనుభూతిలోకి వస్తాయి. శత్రువులు లొంగి నడచుకొంటారు. మాతృసంబంధీకులకు సాయమందిస్తారు. కుజుని సుబ్రహ్మణ్యుని కొలవాలి. రాజకీయులకు ప్రోత్సాహకరమైన కాలం. వృత్తిపరులకు కళాకారులకు మంచి ఆదరణ. విద్యార్థులకు చదువు పరవా లేదు. గృహిణులకు శ్రమ తగ్గుముఖం పడుతుంది.



మకరం
ఉత్తరాషాఢ 2, 3,4 పా. శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా

కీళ్ల బాధలుండవచ్చు. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. సంతాన మూలక సుఖశాంతులు. నూతన వస్త్రాభరణాలు కొంటారు. ప్రయాణాలు సత్ఫలితాల నిస్తాయి. విదేశీ ప్రయాణావకాశాలు కానవస్తున్నాయి. సోదరుల తోడ్పాటు లభిస్తుంది. మిత్రులు సాయమందిస్తారు. కుటుంబంలో సమస్యలు తీరుతాయి. రాజకీయులకు మేలైన కాలం. కళాకారుల ప్రతిష్ఠ పెరుగుతుంది.



కుంభం
ధనిష్ఠ 3,4 పా. శతభిషం, పూర్వ భాద్ర 1,2,3 పా

మనశ్శాంతి తక్కువ. వాహన ప్రమాదాల అవకాశాలు. సోదరుల మూలంగా చికాకు విసుగు. బంధుమిత్రులతో సంబంధాలు వికటిస్తాయి. వాహన గృహ విషయాల ద్వారా ఖర్చు సూచనలు. శరీరానికి గాయాలు తగలకుండా చూసుకోవాలి. ప్రయాణాలు సత్ఫలితాల నిస్తాయి. ఆర్థిక సమస్య లుంటాయి. రాజకీయులు హుషారుగా కాన వస్తారు. విద్యార్థులకు చాలా మేలైన కాలం.



మీనం
పూర్వాభాద్ర 4 పా, ఉత్తరాభాద్ర, రేవతి

వివేచనా శక్తి తగ్గుతుంది. ప్రతి అడుగు ఆచితూచి వేయడం మంచిది. నూతన గృహోపకరణాలు, ఆభరణాలు కొంటారు. గృహనిర్మాణాదులు ఊపందుకొంటాయి. చిన్న చిన్న జబ్బులు బాధిస్తూనే ఉంటాయి. వ్యాపారులు భాగస్వాములతో సఖ్యంగా ఉండడానికి ప్రయత్నించండి. కఠినంగా మాట్లాడవద్దు. రాజకీయులు తోటివారి విషయంలో జాగ్రత్తగా వుండాలి. పైవారిని విమర్శించకుండాలి.

పంచభూతాలు స్వాభావిక అననుకూల సంక్షోభాలు!

డాక్టర్ కేశవనాయర్ బెంగుళూరు

** వాస్తు శాస్త్రాలు పంచ భూతాలు, గృహ వస్తువులు స్వాభావిక అననుకూల సంక్షోభాల్ని వివరించాయా?*

ప్రాచీనులైన ఇరవై ఎనిమిది మంది గురువాస్తు శాస్త్రజ్ఞులు భారతీయ వాస్తు శాస్త్రాన్ని సైంటిఫికల్‌గా మలచారు. వాస్తు గ్రంథాల్లో అగ్ని – లోహం, కలప – నీరు, భూమి – కలప, నీరు – లోహం, నీరు – అగ్ని అననుకూల సంక్షోభాల్ని మహర్షులు వివరించారు.

సి.సుజాత కర్నూలు

** నా వద్ద పాత దేవుడి పటాలు, లలితా సహస్రనామం పుస్తకాలు వున్నవి. ఎక్కడ వుంచాలి?*

దేవుడి పటాలు, పుస్తకాలకు కుంకుమ పూసిన నిమ్మకాయలు మూడు బలి ఇచ్చి వాటిపై కర్పూరపు బిళ్లలు వెలిగించి దేవాలయ ప్రదక్షిణ మార్గంలో కానీ, రావి, అశ్వత్థ, మర్రి వృక్షాల మొదట్లో కానీ వదిలి వేయవచ్చు.

డాక్టర్ ప్రకాశరావు తిరుపతి

** గృహానికి యంత్రాన్ని ఎలా నిర్ణయిస్తారు?*

దంపతుల నక్షత్రాలు లేదా పుట్టిన తేదీలు, గృహ దోషాలు గణించి, గుణించి యంత్రాన్ని సిద్ధాంతి నిర్ణయిస్తారు.

డాక్టర్ వసుధపిళ్లై చెన్నై

** వేద గ్రంథాన్ని చతుర్విధాలుగా విభజించారు. బాగానే వుంది. 'కల్పన గ్రంథ' సంగతి ఏమిటి?*

సంహిత, ఉపనిషత్తు, అరణ్యకం, బ్రాహ్మణం వరకూ మీరు బాగానే అర్థం చేసుకున్నారు. వేద మంత్రాల్ని యజ్ఞయాగాలలో ఉపయోగించు విధం "కల్పము". ఇది సూత్రములు గానూ, వ్యాఖ్యానాలుగానూ వుంటుంది.

ఎన్.శంకరశర్మ హైదరాబాద్

** స్థాన చలనాలు, ఇంట్లో సమస్యలు, పుత్రుడి నిర్వాకాలు జీవితంపై విరక్తిని కలిగిస్తున్నాయి.*

పాజిటివ్ ధృక్పథాన్ని అలవర్చుకోండి. తూర్పు ఆగ్నేయ ద్వారాన్ని ఈశాన్యానికి, పశ్చిమ నైరుతి, వాయువ్యానికి మార్చండి. శివార్చనా పరులై నిష్కామగరిష్ఠులైన మీకు సమస్యలేమిటి? భగవానుడి ఎడ 'అన్యధా శరణం నాస్తి' భావంతో పునరంకితంకండి!

ఎమ్.అశ్వినీకుమారి సూళ్లూరుపేట

** వివాహంలో గుణమేళన చక్రం, నక్షత్ర ఫలం, 'రాశిఫలం' ఏది ముఖ్యం?*

గుణమేళన చక్రం, వ్యతిరిక్త నక్షత్ర ఫలాలు, గుణ, జంతు నిధానాలు మామూలుగా చూసుకోవాలి. పుట్టిన తేది, రాశి, సమయ నక్షత్రం చాలా ముఖ్యమైనవి. అయితే రెండింటినీ చూశాక మాత్రమే 'బలాన్ని' బట్టి నిర్ణయం తీసుకోవాలి.

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

పి.సువర్ణవతీదేవి తడ

** సుదర్శన యంత్ర ప్రతిష్ట చేశాము. నాన్నగారికి స్ట్రోక్ వచ్చింది?*

ఏ యంత్రమైనా సిద్ధాంతి బీజాక్షరాల చార్టు రాయాలి. ఆచారి తయారుచేయాలి. దానికి మూడు రోజులపాటు సాత్విక బలులు(నిమ్మ, టెంకాయ) ఇవ్వాలి. అంగట్లో యంత్రం కొని ఫిర్యాదులు చేయడం వల్ల లాభం లేదు. మీ నాన్నగారి అనారోగ్యం యధాలాపంగా వచ్చిందే!

కె.తిరుపతినాయుడు నాయుడుపేట

** గృహ నిర్మాణం తర్వాత చాలా మంది 'పొట్టేలు' బలి ఇచ్చి, మాంసంతో విందు చేసుకుంటారు ఇది పద్ధతేనా?*

ఇది పూర్వకాలం పద్ధతి. సాత్విక వాస్తు, జ్యోతిష, 'ఆగమ' గ్రంథాలు జంతు బలుల్ని అంగీకరించవు. వశిష్ట, అగస్త్య వాస్తు సంహితలలో మనది అగస్త్య పద్ధతి. అందులో గుమ్మడి, టెంకాయ, నిమ్మబలులే వర్ణించబడ్డాయి.

షేక్ నసీమాబేగం కావలి

** యంత్రం ప్రతిష్టించాక ఎలాంటి మార్పు లేదు. సమస్యలు యధావిధిగా వున్నాయి.*

యంత్రం అంగట్లో కొనరాదు. దంపతుల నక్షత్రాలు, గృహస్థితిని బట్టి ఏ బీజాక్షరాలు రావాలో నిర్ణయించి సిద్ధాంతులు తయారు చేయించి, మూడు రోజుల అష్టవిధ పూజా విధానాలు చేయిస్తారు. తర్వాత ప్రతిష్టించాలి. అంగట్లో యంత్రాలు మేలుకంటే 'కీడే' ఎక్కువ చేస్తాయి.

కోవూరు షుగర్ ఫ్యాక్టరీ భవితపై కమ్ముకొన్న నీలినీడలు!

సహకార రంగంలో నడిచే కోవూరు షుగర్ ఫ్యాక్టరీ భవితవ్యంపై నీలినీడలు కమ్ముకొంటున్నాయి.
ఫ్యాక్టరీకి సీజన్‌లో చెరకు సరఫరా చేసే రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఈసారి పంట వేయలేమంటున్నారు.

జిల్లాలో చరిత్ర కలిగివున్న కోవూరు షుగర్ ఫ్యాక్టరీ భవిష్యత్తుపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫ్యాక్టరీకి పాలకవర్గం ఎన్నికలు జరపడం లేదు. దీని పరిధిలోని బుచ్చి, సంగం, కోవూరు, ఇందుకూరుపేట మండలాల నుంచి చెరకు సరఫరా చేస్తుంటారు రైతులు. సీజన్‌లో చెరకు సరఫరా చేసిన రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించలేకపోతున్నారు అధికారులు. సహకార రంగంలో వున్న ఈ ఫ్యాక్టరీ సరైన పంథాలో నడపడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు.


గత సంవత్సరం రైతుల నుంచి సేకరించి క్రషింగ్ చేసిన చెరకు దాదాపు 3కోట్లరూపాయల బకాయిలు పేరుకుపోయి వున్నాయి. ఫ్యాక్టరీ లోపల సాంకేతికపరమైన సమస్యలు నిత్యం తలెత్తుతున్నాయి. యంత్రాల మరమ్మత్తులకే అధికశాతం నిధులు ఖర్చు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఫ్యాక్టరీ సక్రమంగా నడవకపోవడంతో, ఇతర ఫ్యాక్టరీలకు చెరకు సరఫరా చేస్తున్నారు రైతులు. ప్రైవేటు షుగర్ ఫ్యాక్టరీలు ఆదాయమార్గంలో పయనిస్తుంటే సహకార రంగంలో వున్న కోవూరు ఫ్యాక్టరీ ఎప్పుడూ కష్టాల్లో వుంటూ నష్టాల బాటలో వెళుతోంది. దీన్ని గురించి ఆలోచించి గట్టెక్కించే దిక్కు లేకుండా పోయారు.

సిబ్బందికి జీతాల్లేవు!

కోవూరు షుగర్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న సిబ్బందికి గత ఐదు నెలల నుంచి వేతనాలు చెల్లించలేదు. దాదాపు రెండు కోట్ల రూపాయల మేరకు బకాయిలున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. గత మూడు సీజన్ల నుంచి ఆశించిన మేర క్రషింగ్ జరగకపోవడం ఇందుకు ప్రధాన కారణమని అంటున్నారు. రానున్న సీజన్‌లో క్రషింగ్‌కు ఎంత చెరకు అవసరం అవుతుంది? అన్న వివరాలు అధికారులు వద్ద లేవు. ఫ్యాక్టరీ పరిధిలో ఎంత చెరకు సాగు చేస్తున్నారు ఇప్పటివరకు ఎంత మంది రైతుల నుంచి చెరకు సరఫరా చేసేందుకు అగ్రిమెంటు చేసుకున్నారో సమాధానం దొరకడం లేదు.

సెప్టెంబర్ 29వతేది షుగర్‌ఫ్యాక్టరీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి తొలిసారిగా ఛైర్‌పర్సన్ హోదాలో జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ హాజరయ్యారు. ఫ్యాక్టరీ నిర్వహణ బాధ్యతలు చూస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి వాస్తవాలు వెల్లడించలేకపోయారు. సమావేశానికి హాజరైన చెరకు రైతులు ఫ్యాక్టరీ అభివృద్ధి పథంలో నడిపించేందుకు తమవంతు సహకారం అందిస్తున్నప్పటికి అధికారులు వ్యవహరిస్తున్న తీరు కారణంగా నష్టాల్లో పయనిస్తుందన్నారు. ఇదే విధంగా వ్యవహరిస్తే తాము ప్రైవేటు షుగర్ ఫ్యాక్టరీలకు చెరకు తరలిస్తామని స్పష్టం చేశారు.

సమావేశానికి హాజరైన కలెక్టర్ శ్రీధర్ రైతులకు చెల్లించాల్సిన బకాయిలపై స్పష్టమైన హామీ ఇవ్వలేకపోయారు. కలెక్టర్ ఫ్యాక్టరీ భవిష్యత్తుపై భరోసా ఇస్తారని ఆశించిన రైతులు కొంత అసంతృప్తికి గురయ్యారు. క్రషింగ్ సమయంలో రైతులు సరఫరా చేసే చెరకు మద్దతు ధరను ముందుగానే ప్రకటిస్తామని కలెక్టర్ చెప్పారు. ప్రగతి పథాన



కోవూరు షుగర్ ఫ్యాక్టరీ

ఫ్యాక్టరీని నడిపించేందుకు అందరూ సహకరించాలని ఈ సందర్భంగా కోరారు. డిసెంబర్ నుంచి క్రషింగ్ ప్రారంభమవుతుందని అధికారులు ప్రకటించారు. రైతులు మాత్రం గిట్టుబాటు ధర ఇస్తేనే చెరకు సాగు చేస్తామని స్పష్టం చేస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం స్పందించి ఆర్థిక ఇబ్బందుల్లో వున్న ఈ ఫ్యాక్టరీకి నిధులు కేటాయించాల్సిన అవసరం వుంది.

సమ్మె విజయవంతం

పోరాడి విజయం సాధించిన 108 సిబ్బంది!



ఇక అందుబాటులో 108 వాహనం.

అత్యవసర సమయంలో వైద్య సేవలు అందించేందుకు ఆస్పత్రులకు రోగులను చేరవేసే 108 సిబ్బంది తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళనబాట పట్టారు. గత నెలరోజుల నుంచి జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్నారు. 108 ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమ్మెలో సిబ్బంది పాల్గొన్నారు. అంతిమంగా రాష్ట్రప్రభుత్వ మెడలు వంచి విజయం సాధించారు. 108 సిబ్బంది సమ్మెకు పలు ప్రజాసంఘాల నేతలు మద్దతు తెలిపి ఆందోళనలో పాలు పంచుకోవడంతో విజయం సాధించారు. అధికార యంత్రాంగం ముందు ఈ సమస్యను పట్టించుకోకపోయినా చివరకు దిగిరాక తప్పలేదు.

జిల్లా వ్యాప్తంగా 108 సేవలు నిలచిపోవడంతో అత్యవసర సమయంలో ఆసుపత్రులకు వెళ్లలేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డు ప్రమాదాలు, ఘర్షణలు, గర్భిణీలను కాన్పుల కోసం ప్రతి ఒక్కరూ 108ను ఆశ్రయించి వైద్య చికిత్సల కోసం వెళ్లేవారు. గత నెలరోజుల నుంచి సిబ్బంది మొత్తం సమ్మెలో వుండడంతో వాహనాలు సైతం శిథిలావస్థకు చేరుకునే పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రప్రభుత్వం, జివికె సంస్థల మధ్య కుదిరిన ఒప్పందం అమలుకాకపోవడం కారణంగా 108 సిబ్బంది సమ్మెకు దిగాల్సి వచ్చింది. ప్రతిష్టాత్మకమైన ఈ వైద్య సేవలు ప్రభుత్వ నిర్లక్ష్యం, జివికె సంస్థ బాధ్యతారాహిత్యం వల్లే నిలిచిపోయాయని సిబ్బంది ఆరోపణ.

ఇరవై రోజులకుపైగా 108 వాహన సిబ్బంది తమ సమస్యల పరిష్కారం కోసం చేసిన సమ్మెకు రాష్ట్ర ప్రభుత్వం, జివికె సంస్థలు దిగిరావడంతో విజయవంతమైంది.

108లో డ్రైవర్లు, మెడికల్ టెక్నీషియన్లు ప్రత్యేక శిక్షణ పొంది రోగులకు అత్యవసర సేవలందించేవారు. వీరంతా రోజుకు 12 గంటలు పని చేయాల్సి వుంటుంది. నెలకు 6,000 రూపాయల నుంచి 7,000వేల రూపాయలు వేతనంగా చెల్లించేది ప్రభుత్వం. చాలీచాలని వేతనాలతో కనీస ఉద్యోగ భద్రత లేకుండా ఎటువంటి సంక్షేమ పథకాలకు నోచుకోకుండా తీవ్రమైన పని ఒత్తిడితో గత ఐదు సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తున్నారు. నిత్యం పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో కుటుంబాలు గడవక దుర్భరమైన జీవితాలు సాగిస్తున్నారు. 108 సిబ్బంది బాధలు, సమస్యలను జివికె సంస్థకు పలు దఫాలు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందన్న ఆవేదనతో సమ్మెకు దిగారు.

ప్రభుత్వం కూడా స్పందించకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేయాలని నిర్ణయించుకున్నారు. సిబ్బంది రోడ్లమీదకు వచ్చి వివిధ రూపాల్లో ఆందోళన చేసినా, ఆరోగ్య సేవలందక వేలాది మంది ప్రజలు ఇబ్బందిపడుతూ ప్రాణాలు కోల్పోతున్నా రాష్ట్రప్రభుత్వం, జివికె సంస్థలు ముందు నిర్లక్ష్యంగా వ్యవహరించాయి. జిఓ నెం.3 ప్రకారం వేతనాలు చెల్లించడం, రోజుకు 8గంటల పని విధానాన్ని అమలు చేయాలన్నది వీరి ప్రధాన డిమాండ్. ప్రభుత్వం జివికె సంస్థ ప్రతినిధులతో గత నెలలో చర్యలు జరిపినప్పటికి ఎటువంటి పురోగతి లేకుండా పోయింది. 108 నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకుంటామని జివికె సంస్థ ప్రతినిధులు అల్టిమేటం ఇవ్వడం విశేషం.

ప్రభుత్వంతో ముందుగా కుదుర్చుకున్న ఒప్పందాన్ని అమలు చేసేందుకు నిరాకరిస్తున్న జివికె సంస్థకు 108 నిర్వహణ బాధ్యతలు అప్పగించకుండా వైద్య, ఆరోగ్యశాఖకు అప్పగించాలని కోరుతున్నారు. వాహనాల నిర్వహణ, సిబ్బంది జీత భత్యాలకు ప్రభుత్వం అవసరమైన నిధులను ఇటీవల విడుదల చేయడం జరిగింది. ఎట్టకేలకు 108 సిబ్బంది, ప్రభుత్వం, జివికె సంస్థల మధ్య సుహృద్భావ వాతావరణంలో చర్చలు జరిగి సిబ్బంది డిమాండ్లను అంగీకరించడంతో సమ్మె విరమించారు.



అందానికి కాజల్ చిట్కాలు

ఆరోగ్యంగా వుంటేనే ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయటానికి వీలుంటుందని, దేహం చర్మం ఈ రెండింటిపై నియంత్రణ సాధించినప్పుడే మన అందం మన చేతుల్లో వుంటుందంటుంది హీరోయిన్ కాజల్. మొహం నిత్యం నిగనిగలాడాలంటే క్రమం తప్పకుండా మంచినీరు తాగాలి. అందుకే ఎంత బిజీగా వున్నా క్రమం తప్పకుండా నీళ్లు తాగుతున్నాను. అప్పుడప్పుడు గ్రీన్ టీని సేవిస్తాను. రోజూ అరగంటపాటు చేసే వ్యాయామంతో మెదడు చురుగ్గా పనిచేస్తుంది. కురులు సహజత్వాన్ని కోల్పోయినట్లుగా అనిపిస్తే హాట్ టవల్ ట్రీట్‌మెంట్ చేయించుకొంటాను. వేసవిలోనూ, చలికాలంలోనూ నాణ్యమైన సన్‌స్క్రీన్ లోషన్ వ్రాసుకునే బయటకు వెళ్తానంటుంది.

నేనేం అందగత్తెను కాను!

ఆకట్టుకొనే రూప లావణ్యాలు హీరోయిన్ ప్రియాంక చోప్రా స్వంతం. కాని ఆమె మాత్రం నేనేమి అంత అందగత్తెను కాదంటుంది. అద్దంలో చూసుకొన్నప్పుడు ఓ మోస్తరుగానే వుంటాను. ప్రపంచంలో ఎందరో అందగత్తెలున్నారు. పేరు ప్రఖ్యాతుల గూర్చి పాకులాడను. నాకు నచ్చితే ఏ పనైనా చేస్తాను. నాకు బాగా నటించడం మినహా మరొకటి చేతకాదు. నేను ప్రస్తుతం నటిస్తున్న 'బర్ఫీ' చిత్ర విషయాలు ముందుగా మీడియాకు తెలియకుండా చూడాలని నిర్మాతలు కోరారు కాబట్టి మీడియా వాళ్లకు దూరంగా వున్నాను తప్ప వేరే కారణమేమిలేదని చెప్పుకొచ్చింది.



ఛార్మీ పాట్లు!




హీరోయిన్ ఛార్మికి తెలుగులో అవకాశాలు లేవు. హిందీలో పూరీజగన్నాధ్ పుణ్యాన 'బుడ్డా' చిత్రంలో నటించగలిగింది. దీంతో బాలీవుడ్ దర్శకుల దృష్టి ఛార్మిపై పడింది. జిల్లా ఘజియాబాద్ చిత్రంలో నటించే అవకాశమొచ్చింది. వివేక్‌ఒబరాయ్, అర్షద్‌వార్సి హీరోలు. మినీషా లాంబా మరో హీరోయిన్. ఈమెదే చిత్రంలో మెయిన్‌రోల్. చిత్రంలోని హీరోలు, చిత్ర బృందం ఎవరూ పెద్దగా ఛార్మిని పట్టించుకోవడం లేదట. దీంతో కసిగా హిందీ బాగా నేర్చుకొంటుంది. పంజాబీ అయిన ఛార్మికి హిందీ మీద పట్టున్నా బాలీవుడ్ వాతావరణానికి తగ్గట్టు తన సంభాషణ శైలిని మార్చుకోను చాలాపాట్లు పడుతుంది.

ఐశ్వర్య బదులు కరీనా!



దర్శకుడు మధుర్ బండార్కర్ ఎన్నో కలలు గన్న చిత్రం 'హీరోయిన్'. ఈ సినిమాలో హీరోయిన్‌గా ఐశ్వర్యరాయ్‌ను ఎంపిక చేసుకొన్నాడు. షూటింగ్ మొదలైన పదిరోజులకు తాను గర్భవతినని ఈ సినిమా నుంచి ఐశ్వర్య తప్పుకొంది. దీంతో మధుర్, ఐశ్వర్యల మధ్య మాటల యుద్ధం జరిగింది. ఇప్పుడు ఈ చిత్రంలో ఐశ్వర్య బదులుగా కరీనాను బుక్ చేశాడు మధుర్ బండార్కర్. ఆమెకు 8కోట్ల రూపాయలు పారితోషికంగా అందించాడు. ఈ విషయమై కరీనా మాట్లాడుతూ ఈ సినిమా కారణంగా అమితాబచ్చన్ కుటుంబంతో నాకున్న సంబంధాలకు ఎలాంటి సమస్య రాదు. మా కుటుంబాల మధ్య చక్కని అవగాహన వుంది. అంత పారితోషికం నేనడగలేదు. నేను ఈ చిత్రంలో పాత్రకు సరిపోతానని నిర్మాతలే ఆఫర్ చేశారంటుంది... నమ్ముదామా?

కోరితే అవకాశాలు రావు



ఉల్లాసంగా ఉత్సాహంగా, సింహా, అలా మొదలైంది చిత్రాల్లో మంచి గుర్తింపు తెచ్చుకొన్న హీరోయిన్ స్నేహ ఉల్లాల్‌కు తగినన్ని అవకాశాలు లభించడం లేదు. ఆమె నటించిన మడతకాజా చిత్రం ఈవారం విడుదలయ్యింది. ఈ చిత్రంపై ఆమె చాలా ఆశలు పెట్టుకొని వుంది. ఈ విషయమై మాట్లాడుతూ నరేష్ సినిమా అంటే అల్లరిఅల్లరిగా వుంటుంది. మడతకాజా ప్రేక్షకులకు తీయని వినోదం పంచుతుంది. సినిమాల్లో అవకాశాలు అనేవి ప్రయత్నిస్తే వచ్చేవి కావు. వాటంతట అవే రావాలి. ఇప్పటివరకు నేనెవరినీ సినిమాలో అవకాశం ఇవ్వమని అడగలేదు. అన్నీ వెతుక్కొంటూ వచ్చాయి. బాలకృష్ణగారితో నటించానని చిన్నచిత్రాలలో నటించకూడదని నియమమేమి పెట్టుకోలేదంది.



✍ అల్లూరు రహీం

టైంపాస్ మడత కాజా!

చిత్ర సమీక్ష

రాష్ట్రంలో ఎందరో ఇష్టంగా తింటారని తాపేశ్వరం కాజాకు పేరు. నెల్లూరులోనూ మలై కాజాను మజా చేస్తూ తింటారు. ఈరోజుల్లో తియతీయని మాయమాటలతో అవతలి వారిని మభ్య పెట్టడం తేలికైన విషయం కాదు. ఇదో పెద్ద కళ. ఇటువంటి మాటలు ఎప్పుడో ఒకప్పుడు బయటపడతాయి. అయినా ఏం చేయలేని పరిస్థితుల్లో వాటిని మడత కాజాలని సరిపెట్టుకోక తప్పదు. టింబూ ప్రొడక్షన్స్ పతాకంపై నూతన దర్శకుడు సీతారామరాజు దంతులూరి కథ, స్క్రీన్‌ప్లే కూడా కూర్చి అల్లరి నరేష్‌ను హీరోగా పెట్టి తీసిన మడత కాజా చిత్రమంతా మాట విరుపుల మీదే నడుస్తుంది. హాస్యకథా చిత్రాల్లో కథ మెలికలు తిరుగుతూ నడుస్తూ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాలి. ప్రథమార్థంలో ఈ తరహాలోనే నడిచిన మడతకాజా కథ ద్వితీయార్ధంలో వేగం తగ్గింది. అయితే చాలా వేగంగా నడిచే స్క్రీన్‌ప్లేతో దర్శకుడు ప్రేక్షకులను మాయ చేస్తాడు. ఈ చిత్రంలో మాటల రూపంలో రాజకీయ నాయకులు, సినిమా యాక్టర్లు, వ్యాపారులతోపాటు అన్నివర్గాల వారిపై సెటైర్లున్నాయి. హీరో నాగార్జున బంగారం కొనమంటాడు... వెంకటేష్ తాకట్టు పెట్టమంటాడు... మహేష్‌బాబు చల్లని కూల్ కూల్ చమురు తలకు పెట్టుకోమంటాడు. వీటిలో ఏ పని చేయమంటారని తాగుబోతు రమేష్‌గా ఈ మధ్య ప్రసిద్ధుడైన యువ నటుడు ప్రేక్షకులను ప్రశ్నిస్తాడు. మాటల రచయిత వేగ్నేష సతీష్ సినిమా అంతా పంచ్ డైలాగులతో నింపేశాడు. వాటిని కరెక్ట్ టైమింగ్‌తో దర్శకుడు తెరపై పండించాడు. ప్రేమ చెప్పి పుట్టదు... దోమ చెప్పి కుట్టదు. ప్రేమ టూ కాస్ట్, ప్రేమ పిక్చర్ ట్యూబ్, ప్రేమంటే నిజం... నమ్మకం. మాఫియా అంటే దేశ సేవ. పనిలేని వాడు చేసే వ్యాపారం రియల్ ఎస్టేట్. మోసగాడి కడుపున మోసగాడే పుడతాడు ఈ కోవలోనివే. నూతన సంగీత దర్శకుడు శ్రీ వసంత్ సారధ్యంలో వచ్చాడు, నిన్ను ఇలా చూస్తుంటే, ఎక్స్ క్యూజ్‌మి, గుడుగుడు గుంచం చరణాలతో సాగే పాటలు పరవాలేదనిపిస్తాయి. ఈ సినిమాకు హీరోయిన్ స్నేహాఉల్లాల్ ప్లస్ పాయింట్ కాలేదు. పాలిపోయిన ముఖం, యాక్షన్‌లో ఈజ్ లేదు. కామెడీ పండించే పనిలో ఘనులైన నటులు అలీ, రఘుబాబు, జయప్రకాష్‌రెడ్డి, ఎం.ఎస్.నారాయణ, సుబ్బరాజు, ధర్మవరపు సుబ్రహ్మణ్యం, జీవాలతో పాటు ఆశిష్ విద్యార్థి పోటీపడి నటించాడనాలి. వీరందరితో ఢీ అంటే ఢీ అనేలా హీరో అల్లరి నరేష్ కామెడీని పండించాడు.

చిత్ర కథలోనికివెళ్తే విశాఖపట్నంలోని సీతమ్మధార ప్రాంతంలో నేరాలు ఘోరాలు లేక పోవడానికి కారణాన్ని పోలీస్ కమిషనర్(చలపతిరావు) సిఐ సాయికుమార్(ధర్మవరపు సుబ్రహ్మణ్యం)ను ఆరా తీస్తాడు. దీనికి కారణం పోలీస్ ఇన్ఫార్మర్ కళ్యాణ్ (అల్లరి నరేష్) పనితనమే అంటాడు. అయితే అతనికి పోలీస్ ఉద్యోగం ఇవ్వమంటాడు కమిషనర్. కానీ దాస్యం చేసే ఆ ఉద్యోగం వద్దంటాడు కళ్యాణ్. విశాఖలో చదువుకోను వచ్చే స్వప్న(స్నేహఉల్లాల్)ను ఒక పథకం ప్రకారం తన ప్రేమలోపడేలా చేస్తాడు కళ్యాణ్. ఇంతలో స్వప్నను ఆమె తండ్రి కెపి(ఆహుతి ప్రసాద్) హైదరాబాద్ రమ్మని ఫోన్ చేస్తాడు. ఆమె వెళ్లగా తనతోపాటు అండర్ గ్రౌండ్ డాన్ అయిన జెపి(జయప్రకాష్‌రెడ్డి) కొడుకు అజయ్(సుబ్బరాజు)ను పెళ్లి చేసుకోవాలని తమనిద్దరినీ తన కనుసన్నలలో నడిపే బ్యాంకాక్ సూపర్‌డాన్ నందా (ఆశిష్ విద్యార్థి) ఆదేశించాడంటాడు. తన పెళ్లి విషయం స్వప్న చెప్పగానే హైదరాబాద్ వచ్చే కళ్యాణ్ కెపికి మాత్రం తాను అజయ్‌నని పరిచయం చేసుకొంటాడు. నందా మనిషి దాసు (జీవా)కు కళ్యాణ్‌పై అనుమానం కలుగుతుంది. కళ్యాణ్ అజయ్‌ను తన బుట్టలో వేయను సిఐ సాయికుమార్ కుమార్తెను ఎరగా వాడుతాడు. విశాఖ నుంచి హైదరాబాద్‌కు బదలీ అయ్యే పోలీస్ కమిషనర్ కళ్యాణ్‌కు కెపి, జెపి, నందాల చీకటి సామ్రాజ్యం కూల్చను సహకరించమంటాడు. దీంతో ఒక పథకం ప్రకారం బ్యాంకాక్ వెళ్లే కళ్యాణ్ అతని ప్రేయసి, అజయ్ అతని ప్రేయసిలు నందా మనసు దోచేస్తారు. అతని చీకటి వ్యాపార రహస్యాలు చాలా ఈజీగా సిడీలోకి ఎక్కిస్తారు. చిత్రం చివరన ఈ రెండు జంటల పెళ్లి ఎపిసోడ్‌లో అబద్ధం బద్ధలవుతుంది. చీకటి సామ్రాజ్య సారధులుగా సినిమా అంతా నవ్వించే జెపి, కెపి, నందాలు జైలుకు వెళ్లడంతో చిత్రం ముగుస్తుంది. టైమ్‌పాస్‌కు మడత కాజాకు వెళ్లవచ్చు.

మరో పోరాటం!

ధర్మల్ కాలుష్య పోరాట కమిటీ సమాయత్తం



పోరాట పంథాను ప్రకటిస్తున్న చంద్రమోహన్‌రెడ్డి.

జిల్లాలో ఏర్పాటవుతున్న ధర్మల్ విద్యుత్ ప్రాజెక్టులను అడ్డుకొనేందుకు ధర్మల్ కాలుష్య పోరాట కమిటీ మరో మారు సమాయత్తం అయ్యింది. తెలుగుదేశం, సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) తదితర పార్టీలు, ప్రజా సంఘాలు ముక్త కంఠంతో ధర్మల్ ప్రాజెక్టుల ఏర్పాటును వ్యతిరేకించాయి. అక్టోబర్ 1న తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు కానున్న ధర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడనుందని, పర్యావరణానికి హాని కలుగనుందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో 15 కిలోమీటర్ల పరిధిలో 30వేల మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటవుతున్న 29 ప్రాజెక్టుల వల్ల జిల్లాకు పెను ప్రమాదం సంభవించనుందన్నారు. శాస్త్రవేత్తలు, పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతివ్వడం గర్హనీయం అన్నారు. ప్రముఖ పర్యావరణ వేత్త సాగర ధార అన్ని ధర్మల్ ప్రాజెక్టులు ఏర్పాటైతే ఏటా 1500 మంది మృత్యువాత పడతారని, వేల మంది అనారోగ్యానికి గురయ్యే ప్రమాదముందని నివేదిక ఇచ్చారన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ధర్మల్ ప్రాజెక్టుల ఏర్పాటును ఒప్పుకోమని దీనిపై రాజీలేని పోరాటం చేస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో సిపిఎం నగర కార్యదర్శి మోహన్‌రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పముజుల దశయ్య, సిపిఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి కిషోర్‌బాబు, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు బీద రవిచంద్ర, ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, కన్నబాబు, నూనె మల్లిఖార్జున యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాగితాల్లో విద్యాహక్కు చట్టం!

అమలయ్యేదెలా?

జిల్లాలో విద్యాహక్కు చట్టం కాగితాలకే పరిమితమవుతోంది తప్ప ఆచరణకు నోచుకోవడం లేదు. చట్టం అమలు గురించి పట్టించుకొనే నాధుడు కరువవడంతో దాని లక్ష్యం దెబ్బతింటోంది. 6 నుంచి 14 ఏళ్లలోపు వయసుగల పిల్లలందరికీ తప్పనిసరిగా విద్యను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం విద్యా హక్కు చట్టం – 2009ని తీసుకొని వచ్చింది. 2010 ఏప్రెల్ 1 నుంచి ఇది అమలులోకి వచ్చింది. ఈ విద్యాహక్కు చట్టం ప్రకారం ఫీజులు, బోధనలకు సంబంధించి విద్యాసంస్థలు పలు నిబంధనలను పాటించాల్సి వుంది. విద్యాహక్కు చట్టాన్ని అమలుచేసే బాధ్యత రాజీవ్ విద్యామిషన్‌కు అప్పజెప్పింది ప్రభుత్వం. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అడ్మిషన్లలో 25 శాతం సీట్లు వికలాంగులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కేటాయించాల్సి వుంది. వీరి ఖర్చును ప్రభుత్వం భరిస్తుంది. ఆయా పాఠశాలల్లోని విద్యార్థుల వద్ద నుంచి వసూలుచేసే ఫీజుల వివరాలు, ఉపాధ్యాయుల విద్యార్హతలు నోటీసు బోర్డులో వుంచాలి. బోధకులకు డిఎడ్, బియిడి అర్హత వుండాలని నిబంధన వుంది. అయితే ఇదెక్కడా అమలు కావడం లేదు. పలు పాఠశాలల్లో సరైన అర్హతలేని ఉపాధ్యాయులే పాఠ్యాంశాలను బోధిస్తున్నారు. తక్కువ జీతం చెల్లించే అవకాశం వుండడంతో ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు అలాంటి వారిపైనే మొగ్గు చూపుతున్నారు. విద్యాహక్కు చట్టం అమలులోకి వచ్చి ఏడాది అవుతున్నా నిబంధనలు అమలు చేయడంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో చట్టానికి తూట్లు పడుతున్నాయి.

కల్తీ... కల్తీ... కల్తీ!

నిద్రావస్థలో అధికార గణం

జిల్లావ్యాప్తంగా నిత్యావసర వస్తువుల కల్తీ జోరుగా జరుగుతుంది. బియ్యం దగ్గర్నుంచి టీ పొడి వరకు కాదేది కల్తీకి అనర్హమన్నట్లు పెద్ద ఎత్తున కల్తీ వ్యాపారం జరుగుతుండడంతో వినియోగదారులు తీవ్రంగా నష్టపోతుండడంతోపాటు అనారోగ్యం పాలౌతున్నారు. అన్నింటా కల్తీ జరుగుతుండడంతో ఏది కొనాలో, ఏది తినాలో, ఏమి తింటే ఏమి జరుగుతుందో తెలియని స్థితిలో వినియోగదారులు సతమతమవుతున్నారు. పాలల్లో కల్తీ, టీ పొడి కల్తీ, మిరప్పొడిలో ఏకంగా రెడ్ ఆక్సైడ్ కల్తీ, మిరియాల్లో బొప్పాయి గింజల కల్తీ, డాల్డాలో సర్వం కల్తీ, నూనెల్లో ముడిపత్తి గింజల నుంచి తీసిన నూనెను కలిపి అమ్మకాలు సాగిస్తుండడంతో జేబులకు చిల్లులు పడడంతోపాటు ప్రాణాంతకంగా తయారౌతుండడంతో ప్రజలు స్వచ్ఛమైన ఆహారాన్ని తీసుకోలేని పరిస్థితి ఎదురౌతోంది. టీ పొడిలో చింతగింజలు, ఇనుపరజను, షూపాలిష్ కలపడం వల్ల మంచి రంగు వస్తుంది. అలాంటి టీ తాగడం వల్ల జీర్ణకోశం దెబ్బతినడంతోపాటు ప్రాణాల మీదకు తెచ్చుకొనే ప్రమాదం వుందని, అలాగే రెడ్ ఆక్సైడ్ కలిపిన మిరప్పొడి వినియోగించడం వల్ల క్యాన్సర్ తదితర ప్రాణాంతక వ్యాధుల బారినపడే అవకాశాలధికంగా వున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కల్తీని నిరోధించేందుకు పౌరసరఫరాల శాఖ, ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు ఆరోగ్యశాఖ అధికారులు, ఆహార సలహా సంఘం తదితర శాఖలున్నప్పటికీ సక్రమంగా విధి నిర్వహణ చేయక వ్యాపారులతో లాలూచీపడి ఎప్పుడో ఒకసారి దాడులుచేసి చేతులు దులుపుకొంటుండడంతో వినియోగదారులు అటు ఆర్థికంగా, ఇటు ఆరోగ్యపరంగా నష్టపోతున్నారు.

క్రమబద్ధీకరణ గడువు పెంపు

అక్రమ లేఅవుట్‌ను సక్రమం చేసుకోండి!



నెల్లూరు రూరల్ మండలంలో ఇటువంటి లేఅవుట్లు ఎన్నో.

అనుమతి లేకుండా వేసిన లేఅవుట్ల క్రమబద్ధీకరణకు మరో మూడు నెలలపాటు ప్రభుత్వం గడువు పొడిగించింది. నిర్ణీత గడువు లోపు లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం చేసుకున్న దరఖాస్తులనే పరిశీలించి పరిష్కరిస్తారు. కొత్తగా ఎటువంటి దరఖాస్తులు తీసుకోరాదని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. 2008 సంవత్సరంలో ప్రారంభమైన క్రమబద్ధీకరణ గత మూడు సంవత్సరాలుగా కొనసాగుతుంది. ప్రతి మూడు నెలలకోసారి గడువును పొడిగిస్తారు. నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో వేసిన లేఅవుట్లలోనే క్రమబద్ధీకరించనున్నారు. ఇందుకు అవసరమైన రుసుంను లేఅవుట్ల నిర్వాహకులు చెల్లించాల్సి వుంటుంది.

● మకతిక

మనీసర్క్యులేషన్ స్కీమ్!



ఎస్పీకి నిత్యం బాధితుల నివేదనే.

జిల్లాలో మనీ సర్క్యులేషన్ స్కీం పేరుతో కోట్ల రూపాయలు వసూలు చేసిన న్యూవిజన్ ఫౌండేషన్ కేసు దర్యాప్తులో పోలీసులు కొంత పురోగతి సాధించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు ప్రత్యేక బృందం ఫౌండేషన్ నిర్వాహకుల కోసం గాలింపు చేపట్టింది. గత వారంలో ఈ సంస్థకు చెందిన భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తిని చిత్తూరుజిల్లా శ్రీకాళహస్తిలో అదుపులో తీసుకున్నారు. నగదు చెల్లించిన బాధితులు ఎప్పుడు నగదు తిరిగి ఇస్తారా అని ఎదురు చూస్తున్నారు. ప్రజల నుంచి నగదు వసూలుచేసిన ఏజెంట్లపై ఇప్పటికే నెల్లూరు రూరల్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన ప్రత్యేక సెల్‌లో ఫిర్యాదులు చేసి వున్నారు. కొన్ని ప్రాంతాల్లో పట్టుబడిన నగదు, బ్యాంకులో స్థంభింపజేసిన నగదు దాదాపు 15 కోట్ల రూపాయల వరకు వుంది. ఈ నగదును బాధితుల్లో కొందరికైనా చెల్లించేందుకు జిల్లా ఎస్పీ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మరో ప్రక్క నెలలు గడుస్తున్న కొద్దీ బాధితులు ఆందోళన చెందుతున్నారు. చెల్లించిన నగదు తిరిగి వస్తుందో రాదోనన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. న్యూవిజన్ ఫౌండేషన్‌తోపాటు భారత్ ప్రేమ్ సదన్, హిమ్ మరో ఎనిమిది సంస్థలు మనీ సర్క్యులేషన్ స్కీంలు జిల్లాలో నిర్వహిస్తున్నాయి. ఈ సంస్థల్లో ఏజెంట్లుగా వున్నవారు కొందరు వసూలుచేసిన నగదును ఆయా సంస్థల్లో జమచేయగా, మరికొందరు ఏజెంట్లు స్వాహా చేశారు. స్వాహాచేసిన ఏజెంట్లపై ఒత్తిడి రావడంతో కొంత భాగాన్ని తిరిగి చెల్లించారు. ఇదేవిధంగా మిగిలిన ఏజెంట్లు కూడా నగదు చెల్లించాలని పోలీసులు బలవంతం చేస్తున్నారు. ఇటీవల కొందరు ఏజెంట్లు జిల్లా ఎస్పీని కలిసి సంస్థకు చెల్లించిన నగదు తిరిగి ఇప్పించండే తాము బాధితులకు అందజేయలేమని విన్నవించుకున్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు రూ.10వేలు పెంపు!

ఇందిరమ్మ పథకం ద్వారా నిర్మిస్తున్న గృహ నిర్మాణాల్లో రాష్ట్ర ప్రభుత్వం కొన్ని మార్పులకు శ్రీకారం చుట్టింది. ఈ పథకంలో గృహం నిర్మించుకున్న లబ్దిదారులకు బిల్లుల చెల్లింపులో ఇప్పటివరకు తీవ్ర జాప్యం జరిగేది. ప్రభుత్వం చేసిన మార్పులతో త్వరితగతిన బిల్లుల చెల్లింపుకు అవకాశం ఏర్పడింది. గతంలో గృహనిర్మాణం కోసం లబ్దిదారుని వాటా కాకుండా ప్రభుత్వం 35వేల రూపాయలు చెల్లించేది. ఈ మొత్తాన్ని 45వేల రూపాయలకు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. ఇల్లు మంజూరై అసంపూర్తిగా వున్న వాటికి కూడా 45వేల రూపాయలు చెల్లిస్తారు. ఇప్పటివరకు పూర్తిచేసిన గృహాలకు బిల్లులు రాష్ట్ర రాజధాని నుంచి మంజూరు చేసేవారు. ఇక నుంచి జిల్లా కేంద్రంలోనే బిల్లులు మంజూరుచేసే విధంగా చర్యలు తీసుకొన్నారు. ఈ మేరకు గృహనిర్మాణ సంస్థకు ప్రభుత్వం నుంచి ఆదేశాలందాయి.

జిల్లాస్థాయిలోనే ఇక బిల్లుల మంజూరు

సంకటంలో సోనియా

మొదటి పేజీ కొరవ

సమస్య పరిష్కారానికి ఏ ఆలోచన చేసినా ముడి మరింత చిక్కు పడుతున్నదే తప్ప విడివడడం లేదు.

సోనియాగాంధీ రాజనీతిజ్ఞతకు, ప్రధాని పరిపాలనా పఠిమకు ఇదొక అగ్ని పరీక్ష. వారి నిర్ణయం కోట్లాది మంది ప్రజల జీవితాలను ప్రభావితం చేయబోతున్నది. ఇక్కడ సమస్య కాంగ్రెస్ పార్టీని బ్రతికించుకోవడం ఒక్కటే కాదు. ఒక ఎన్నికలో ఒక రాష్ట్రంలో ఓడినంత మాత్రాన ఆ పార్టీకి వచ్చే నష్టం ఏమీ లేదు. అటువంటి ఓటములు ఎన్నిటినో చూసిన పార్టీ అది. గెలుపు ఓటముల కంటే కీలకమైనది ఉభయ ప్రాంతాల ప్రజలను సంతృప్తిపరచడం మాత్రమే. సకల జనుల సమ్మెతో స్తంభించిపోయిన రాష్ట్ర పరిపాలనా వ్యవస్థను ఎంతోకాలం నాన వేయడం ఎవరికీ మంచిది కాదు. ఏదో ఒక పరిష్కారం సత్వరం వెతికి తీరాలి. అది ఏదన్నది ప్రశ్న.

రాష్ట్రపతి పాలన పెట్టి ఉద్యమాన్ని అణిచివేసే ప్రయత్నం చేయాలన్నది ఒక ఆలోచన. అందుకోసమే గవర్నర్ నరసింహన్‌ను అత్యవసరంగా ఢిల్లీకి రమ్మని సందేశం పంపాడు ప్రధాని. కానీ రాష్ట్రపతి పాలనతో ఉద్యమం చల్లారుతుందని ఎవరూ హామీ ఇవ్వలేరు. రెండవ ఎస్సార్సీ వంటి ప్రయోగాలు ప్రతికూల ఫలితాలు ఇస్తాయే తప్ప పరిష్కారం చూపవు. ముఖ్యమంత్రి మార్పు వల్ల కూడా పెద్దగా ప్రయోజనం వుండక పోవచ్చు. తెలంగాణ ఇస్తామనే ప్రకటన చేస్తే, ఆంధ్ర ప్రాంతంలో ఎదురయ్యే పరిస్థితులపై ఎవరికీ స్పష్టమైన అవగాహన లేదు. లగడపాటి వంటి రాజకీయవాదులు గోల చేస్తున్నట్లు నిజంగానే రాష్ట్ర విభజన పట్ల ఆంధ్ర ప్రాంతంలో ఇంతే ఉధృతమైన వ్యతిరేకత పెల్లుబుకుతుందా అన్నది, ఆ పరిస్థితి వస్తే తప్ప తేలని అంశం. దానిపై సరైన అంచనా లేకుండా తొందరపడి తెలంగాణ ఇస్తే, ఒక వేళ నిజంగానే లగడపాటి మాట నిజమై ఆంధ్ర ప్రాంతంలో ప్రజలు వీధులలోకి వస్తే, సమస్య ఇంకా పెద్దదౌతుంది. ప్రమాదకరంగా మారుతుంది. అయితే ఎవరెన్ని చెప్పినా తెలంగాణ ప్రజలలో రాష్ట్ర ఏర్పాటు పట్ల వున్నంత తీవ్రమైన ఆకాంక్ష ఆంధ్ర ప్రాంతంలో లేదని ఒక అభిప్రాయం. సమైక్యాంధ్ర నినాదం రాజకీయవాదులు సృష్టిస్తున్న వివాదమే తప్ప ప్రజలలో లేదనే మాట ఒకటి విన్పిస్తున్నది. పరీక్షకు పెడితే తప్ప అందులో నిజానిజాలు తేలవు.

జగన్

మొదటి పేజీ కొరవ

రాబాదులో తనకున్న వ్యాపార సామ్రాజ్యానికి అది అవరోధమని భయం. ఉద్యమకారుల ప్రతాపం ఏమిటో చూద్దామని సాహసించి మహబూబాబాద్‌కు వెళ్తే మాదు పగిలే దెబ్బ కొట్టారు. దానితో తెలంగాణ జిల్లాలో తిరగడం మానుకొన్నాడు ఇంతకాలం. ఆ కొరత ఇప్పుడు తీర్చుకోవాలన్నది ప్రణాళిక. గుంటూరు పర్యటనలో భాగంగా సరిహద్దులకు వెళ్లి, అందరూ అదమరిచి వున్న సమయం చూసుకొని, నల్గొండ జిల్లాలో అడుగుపెట్టి, తెలంగాణలోనూ తనకు ప్రాబల్యం వుందని నిరూపించుకొనే ఆలోచన చేస్తున్నాడు. పల్నాడు ప్రాంతం రెడ్డి యువజనులను పెద్ద ఎత్తున సమీకరించి, నల్గొండలోకి ప్రవేశిస్తే ఉద్యమకారులు ఏమీ చేయలేరన్నది ధీమా. ఇట్లా దొడ్డిదారిన తమ భూభాగంలోకి అడుగు పెట్టాలని జగన్ చేస్తున్న ప్రయత్నాన్ని ఉద్యమకారులు ఎట్లా ప్రతిఘటిస్తారో వేచి చూడాలి.

నెల్లూరు ముచ్చట్లు

3వ పేజీ కొరవ

సదస్సు 8, 9 తేదీల్లో నెల్లూరులోని హోటల్ సన్నీ హైట్స్‌లో జరుగుతుంది. ఈ సదస్సులో స్వీడన్, కొరేషియా, అమెరికా, డెన్మార్క్ దేశాల నుంచి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వైద్య నిపుణులొస్తున్నారు. దేశంలో పేరుగాంచిన 18 మంది డయాబెటిక్ వైద్య నిపుణులు పాల్గొంటున్నారు. నెల్లూరు నగరంలోని డాక్టర్లంతా ఈ సదస్సుకు హాజరుకమ్మంటున్నాడు కార్యక్రమ నిర్వాహకుడు షుగర్ డాక్టర్ పి.సత్యనారాయణ మూర్తి.

మార్చిలో ఓపెన్ జైలుకు ఖైదీలు

కాకుటూరులో నిర్మాణం పూర్తి చేసుకొంటున్న ఓపెన్ జైలుకు మార్చి నెలలో వంద మంది ఖైదీలను నెల్లూరు సెంట్రల్ జైలునుంచి తరలిస్తామని జైళ్ల శాఖ డిజిపి శామ్యూల్ జాన్సన్ చెప్పారు. రెండో విడతగా మరో 160 మందిని ఇక్కడకు తరలిస్తామన్నారు. 13 కోట్ల రూపాయలు వెచ్చించిన ఈ జైలులో 320 మంది ఖైదీలు వుండవచ్చని ఆయన స్పష్టం చేశారు.

అతిథి గ్రాండ్‌ను ప్రారంభించిన రోశయ్య

దర్గామిట్టలో కెవిఆర్ పెట్రోల్ బంక్ ప్రక్కన రిలయన్స్ మిద్దెమీద నూతనంగా ఏర్పాటుచేసిన అతిథి గ్రాండ్ హోటల్‌ను తమిళనాడు గవర్నర్ రోశయ్య అక్టోబర్ 1వ తేది ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన హోటల్ నిర్వాహకులను అభినందించి మంచి పేరు తెచ్చుకోవాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో హోటల్ నిర్వాహకుడు సురేష్‌తోపాటు మంత్రి రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు వివేకానందరెడ్డి, శ్రీధర్‌కృష్ణారెడ్డి, కలెక్టర్, ఎస్పీ తదితరులు పాల్గొన్నారు.

సరికొత్త వస్త్ర ప్రపంచం రుక్మిణి శిల్క్

నెల్లూరు కావుపీధిలో మహిళల సొగసు, సోయగం, సౌందర్యం మరింత పెంచే స్థాయిలో నెలకొల్పిన వస్త్రశ్రేణి ప్రపంచం రుక్మిణి శిల్క్‌ను 7తేది రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే శ్రీధర్‌కృష్ణారెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీలతోపాటు అందాల నటి తాప్సీ కూడా పాల్గొన్నారు.

ఆనం బ్రదర్స్ పొగడ్తలు

తమిళనాడు గవర్నర్ రోశయ్య నెల్లూరు పర్యటన సందర్భంగా జరిగిన పౌర సన్మానంలో ఆయన్ను పొగడడంలో ఆనం బ్రదర్స్ పోటీపడ్డారు. రోశయ్య నిర్వహించిన ఆర్థిక మంత్రిత్వ శాఖను తాను చేపట్టడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆర్థిక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రకటిస్తే, ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి వుండే తత్వం రోశయ్యదని రూరల్ శాసనసభ్యుడు ఆనం వివేకానందరెడ్డి ప్రశంసించారు. ఆయన ప్రక్కన కూర్చొని, ఆయన్ను చూసి ఎంతో నేర్చుకొన్నామని సోదరులిద్దరూ పోటీపడడాన్ని చూసిన సభకు విచ్చేసిన వారు ఔరా... ఆనం బ్రదర్స్ అంటూ, గతంలో రోశయ్య ముఖ్యమంత్రిగా వున్నప్పుడు ఆయన ప్రభుత్వంలో పనిచేయాల్సి రావడం మా దురదృష్టం అన్న మంత్రి ఇప్పుడు ఇలా అంటున్నాడు అని చర్చించుకోవడం జరిగింది.

ఆయనా వైశ్యుడే!

నగర శాసనసభ్యుడు ముంగమూరు శ్రీధర్ కృష్ణారెడ్డి కులానికి రెడ్డి అయినా ప్రవృత్తి రీత్యా వైశ్యుడేనని గవర్నర్ రోశయ్య అనడంతో సన్మాన సభలో నవ్వులు విరిశాయి. అదేవిధంగా అచ్చ తెలుగులో ఆకట్టుకొనేలా మాట్లాడిన అదనపు జెసి లక్ష్మీకాంతంను రోశయ్య అభినందించారు. ఆయన్ను చూసి తెలుగు ఎంత చక్కగా మాట్లాడాలో నేర్చుకోవాలని ప్రశంసించారు.

చైల్డ్ అండ్ పోలీస్

బాల కార్మికులు, మురికివాడల్లో తిరిగే బాల లను సక్రమ మార్గంలో పెట్టి తీర్చిదిద్దేందుకు జిల్లా పోలీస్ చైల్డ్ అండ్ పోలీస్ పేరుతో నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఎస్పీ రమణకుమార్ బోడిగాడితోటలో గల బాలలను అక్కున చేర్చుకొనేందుకు ఉద్దేశించిన ఈ పథకాన్ని డిజిపి దినేష్‌రెడ్డి ప్రారంభించారు. అనిల్ గార్డన్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో డిజిపి నెల్లూరు పోలీసులు శ్రీకారం చుట్టిన చైల్డ్ అండ్ పోలీస్ ప్రాజెక్ట్ రాష్ట్ర పోలీసులకు ఆదర్శమన్నారు. మురికివాడల్లో తిరిగే బాలలను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునివ్వడంతోపాటు తన వంతుగా లక్ష రూపాయల విరాళాన్ని ప్రకటించారు. రత్నం విద్యా సంస్థల అధినేత కెవిరత్నం మరో లక్ష రూపాయలు ఇచ్చారు. అనంతరం డిజిపిని ఘనంగా సన్మానించారు. ఎస్పీ రమణకుమార్ పనితీరును దినేష్‌రెడ్డి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

లంచం తీసుకొంటూ పట్టుబడ్డ ఎస్ఐ

గడ్డివామి దగ్ధం కేసులో నిందితులపై కేసు నమోదు చేసేందుకు బాధితుని వద్ద నుంచి మూడు వేల రూపాయలు లంచం తీసుకొంటున్న చిట్ట మూరు ఎస్ఐ జిలానీబాషాను ఎసిబి అధికారులు పట్టుకొన్నారు. మండలంలోని మెట్ట గ్రామ రైతు జనార్దన్‌రెడ్డి నుంచి లంచం తీసుకొంటుండగా సమాచారం అందుకొన్న ఎసిబి డిఎస్పీ శరత్‌బాబు ఆధ్వర్యంలో అధికారులు దాడిచేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. జిలానీబాషా గతంలో ఎసిబిలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసి వుండడం కొసమెరుపు.

కలెక్టర్‌కు కొత్త కారు

జిల్లా కలెక్టర్ శ్రీధర్‌రెడ్డికి కొత్త ఇన్నోవా కారును సమకూర్చింది ప్రభుత్వం. ఈ కారుకు ఎపి 26 ఎఎన్ సిరీస్‌తో ఒకటో నెంబర్‌ను కేటాయించారు ఆర్‌టిఏ అధికారులు. ఇకపై టయోటా ఇన్నోవా కారులో తిరుగనున్నారు కలెక్టర్.

ఏమి రాజసం?

తమిళనాడు గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా నెల్లూరుకు విచ్చేసిన రోశయ్యను, ఆయన వాహనాలను చూసి ప్రజలు ఏమి రాజసం అని చర్చించుకొన్నారు. గవర్నర్‌కు వుండే పెద్ద కారుతోపాటు సహాయకులు, భద్రతా సిబ్బంది మరో 12 వాహనాల్లో రావడం చూసిన నగర వాసులు ఎంతైనా రోశయ్య అదృష్టవంతుడు అని వ్యాఖ్యానించారు.

జనవాణి

2వ పేజీ కొరవ

కోవడం బాధాకరం. అనేక కుంభకోణాల్లో కూరుకపోయిన యుపిఏ ప్రభుత్వానికి రాహుల్‌గాంధీ లాంటి అనుభవ శూన్యుడు నాయకత్వం వహించలేడు. బిజెపిలో కూడా సమర్ధ నాయకుడు లేడు. వాస్తవం చెప్పాలంటే దేశం చాలా గడ్డు పరిస్థితుల్లో వుంది.

కె.వెంకటేశ్వరబాబు నెల్లూరు

జిల్లా సర్వస్వం ప్రచురించాలి!

నెల్లూరుజిల్లా అన్ని రంగాలలో అగ్రస్థానము కలిగి మహోన్నత చరిత్రలో శతాబ్దాల పర్యంతము విరాజిల్లుతున్నది. ప్రాచీన ఆధునిక సమాచారముతో ప్రజలకు వివరాలు తెలియవలసిన అవసరం ఎంతైనా వుంది. కొన్ని దశాబ్దాలకు పూర్వం జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా వున్న నల్లపురెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్ని రంగాలలో నిష్ణాతులైన చరిత్ర పరిశోధకులచే ఒక కమిటీ వేసి 'నెల్లూరు జిల్లా సర్వస్వం' అనే గ్రంథాన్ని ప్రచురించారు. నాటికి, నేటికి పరిస్థితుల్లో ఎన్నో మార్పులొచ్చిన దృష్ట్యా జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని ఒక కమిటీ ఏర్పాటుచేసి సరికొత్త నెల్లూరు జిల్లా సర్వస్వాన్ని ప్రచురించ మనవి.

బి.పట్టాభిరామయ్య నెల్లూరు

Before the Ist Addl. Motor Accidents Claims Tribunal, Nellore

M.V.O.P.No:807/2010

1.Shaik Shahajadi and 2 others... claimants

Vs

1.V.Rajesh and another... Respondents

NOTICE

To, R1, V.Rajesh s/o Venkataiah,
R.N.Pet, Nellore, SPSR Nellore Dist.

పై నెంబరున క్లయిమెంట్ మీపై నష్టపరిహారం కోరుతూ పై కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషనులో మీకు నోటీసు నిమిత్తం తే11.10.2011దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10-30 గంటలకు మీరు స్వయంగాగానీ లేదా వకీలు ద్వారాగానీ పైకోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

పి.శ్రీనివాసులు, M.A., B.L.,
క్లయిమెంట్ తరపు అడ్వకేట్, కావలి.

Before the Ist Addl. Motor Accidents Claims Tribunal, Nellore

M.V.O.P.No:806/2010

1.Shaik Sharmila and 5 others... claimants

Vs

1.V.Rajesh and another... Respondents

NOTICE

To, R1, V.Rajesh s/o Venkataiah,
R.N.Pet, Nellore, SPSR Nellore Dist.

పై నెంబరున క్లయిమెంట్ మీపై నష్టపరిహారం కోరుతూ పై కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషనులో మీకు నోటీసు నిమిత్తం తే10.10.2011దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10-30 గంటలకు మీరు స్వయంగాగానీ లేదా వకీలు ద్వారాగానీ పైకోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

పి.శ్రీనివాసులు, M.A., B.L.,
క్లయిమెంట్ తరపు అడ్వకేట్, కావలి.

శ్రీకృష్ణదేవరాయల "కీర్తి చంద్రిక"ల సింహావలోకనం!

శ్రీకృష్ణదేవరాయలు గొప్ప సాహిత్యకారుడు, యుద్ధ నిపుణుడు, వ్యూహవేత్త, మేధావి. ఆయన వ్యూహరచన తిరుగులేనిది. యుద్ధాలలో రాయలు అపజయమెరుగకపోవడానికి ఆయన వ్యూహరచన, సమయోచిత ప్రజ్ఞ మూలకారణాలు. ఆయన యుద్ధతంత్రం అమోఘమని చరిత్రకారుల ఉవాచ.

హిందూమత పరిరక్షణకు, తురుష్కుల నిలువరింతకు కంకణబద్ధులై దేవగిరి యాదవ రాజ్యం, ఓరుగల్లు, హోయ శ్సల, ద్వార సముద్రం, కంపిలి, విజయనగర సామ్రాజ్యం నిలిచి ఉండకపోయి వున్నట్లయితే భారతదేశం దక్షిణాది రాష్ట్రాలలో హిందూ మతం నామమాత్రంగా నిలచి ఉండేది. ఇం దులో విజయనగర యాదవ రాజ్యాల పాత్ర విశి ష్టమైనది. భారతీయులకు హిందూ రాజ్య పరి రక్షణకు నడుం బిగించిన సిక్కులు, రాజస్థా నీయులు, మహారాష్ట్రులతోబాటు పై దక్షిణాది రాష్ట్రాల రాజ్యాధినేతలందరూ కూడా ఇందువ లన ప్రాతఃస్మరణీయులు.

రాయలపై పదునాలుగు నిర్దుష్టమైన వ్యాసాలను సుప్రసిద్ధ చరిత్రకారులైన డాక్టర్ వడ్డి విజయసారధి సేకరించి "శ్రీకృష్ణదేవ రాయల విజయ చంద్రిక" పేర ఓ విశిష్ట మహో త్కృష్టమైన వ్యాస సంకలనాన్ని వెలువరించారు.

శ్రీకృష్ణదేవరాయల కీర్తిచంద్రిక

సంకలన కర్త : **డాక్టర్ వడ్డి విజయసారథి**

సమీక్షకుడు : **పాయసం సుబ్రహ్మణ్యం**

పేజీలు : **164** వెల : **75/-**

ప్రతులకు

సాహిత్యనికేతన్
ఏలూరు రోడ్, గవర్నరుపేట
విజయవాడ – 2

అపురూపమైన ఫోటోలు

ఇందులో అపురూపమైన ఫోటోలు, అల భ్యమైన కృష్ణదేవరాయల ఛాయాచిత్రాల్ని భావిత రాలకు అందించడం ఆయన చేసిన మహోప కారం.

ఇందులో సుప్రసిద్ధ చరిత్రకారులు నేల టూరు వేంకటరమణయ్య, ఈమని శివనాగిరెడ్డి, రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ, గాడిచర్ల హరిసర్వో త్తమరావు, గడియారం రామకృష్ణశర్మ, డాక్టర్ కలికివాయి మహాంకాళిరావు, పులుసు గోపిరెడ్డి, డాక్టర్ ప్రసాదరాయ కులపతి, డాక్టర్ చిలుకూరి సుబ్రహ్మణ్య శాస్త్రి, డాక్టర్ అనంతలక్ష్మి, డాక్టర్ ముదివేడు ప్రభాకరరావు, కొమర్రాజు వేంకట లక్ష్మణరావు వంటి దిగ్దంతులు వివిధ కోణాల నుంచి రాయల జీవితాన్ని దర్శించిన విశిష్టమైన వ్యాసాలున్నాయి. రాయల జీవనశైలిని ఫెరిస్తా డొమింగోఫేస్, కిస్టోరావ్ ఫి ఫిగిరిడో, అబ్దుల్ రజాక్ వంటి పాశ్చాత్యుల రచనల వల్ల మనం గుర్తించగలిగాం.

రాయలు బహుముఖుడు!

రాయలు సాహిత్యకారుడు, యుద్ధ నిపు ణుడు, వ్యూహవేత్త, మేధావి అలా ఎంతైనా, ఎన్నైనా చెప్పవచ్చు. వ్యూహరచన తిరుగులేనిది. యుద్ధాలలో రాయలు అపజయ మెరుగకపోవ డానికి ఆయన వ్యూహరచన, సమయోచిత ప్రజ్ఞ మూల కారణాలు. అపజయం ఎదురవుతున్న స్థితిలో కూడా ఆయన ప్రదర్శించిన యుద్ధ తంత్రం స్వపక్షంలో వారిని కూడా ముందుకు నడిపిస్తాయని నేలటూరి వారి వ్యాసం చెబు తున్నది.

రాయల తర్వాత చక్రవర్తి అయిన సవతి తమ్ముడు అచ్యుత దేవరాయలు పిరికిపంద. యుద్ధాలలో స్వయంగా పాల్గొనేవాడు కాదు. అయితే కృష్ణదేవరాయల పరిస్థితి వేరు. రొమ్ము ఒడ్డి సైన్యానికి ముందు భాగంలో నిలచి యుద్ధం చేసేవాడు. ఆదుకొనేవాడు. అందువల్లే సైన్యం రాయలకోసం ఎంతకైనా సిద్ధపడేవారు.

అయితే నేలటూరి వేంకటరమణయ్య ఆయన 8 ఆగష్టు 1509లో సింహాసనం అధి ష్టించాడని రాశాడు. ఈ అంశంలో చాలా భిన్నా భిప్రాయాలున్నాయి.

సంక్షోభాలు

దక్షిణ భారతదేశంలోని దేవగిరి, ఓరు గల్లు, ద్వారసముద్రం మధువ, కంపిలి, విజయ నగర సంక్షోభాలను గురించి గడియారం రామ కృష్ణశర్మ సంక్షిప్త వివరణలు ఇచ్చినా అవి చక్కగా వున్నాయి. ఆయన అన్నట్లుగా ప్రోలయ వేమా రెడ్డి, 'మ్లేచ్ఛుల'తో చేసిన యుద్ధాలు ఆయన కీర్తిని అజరామరం చేశాయి.

విజయనగర సామ్రాజ్యం చతుర్థ్వంశ పరి పాలన విశ్లేషణ డాక్టర్ కలికివాయి చక్కగా చేశారు. పులుసు గోపిరెడ్డి రాయల జనన మరణ కాలాలను నిర్ధారించడానికి ప్రయత్నించి రాయల జననం క్రీ.శ 1489 అని నిర్ధారణకు వచ్చారు.

విజయనగర సామ్రాజ్య కాలంలో ప్రజా జీవన అనే వ్యాసంలో డాక్టర్ చిలుకూరి చాలా విషయాలు చెప్పారు. అయితే సామాన్య ప్రజలు పన్నుల భారంతో వలసలు పోవడం, వివా హపు పన్ను భారంతో కన్యలు అవివాహితు లుగా వుండి పోవడం, సైన్యంలోని పదాతి దళం కేవలం గోచిపాతలు ధరించడం అనా లోచితంగా వీరిని ముందు భాగంలో నిలపడం వల్ల అనేకులు అనవసర మరణాలకు గురవడం వంటి అంశాలను ప్రస్తావించి వుంటే బాగుం దేది.

అనవసర ప్రస్తావన

రాయల కాలంలో ప్రబంధాలు వ్యాసంలో డాక్టర్ అనంతలక్ష్మి తెనాలి రామకృష్ణుని పాం డురంగ మహత్యాన్ని ప్రస్తావించకపోయి వుంటే బాగుండేది. ఎందుకంటే రామకృష్ణుడు రాయల రెండవ కుమార్తె వెంగళాంబ కుమారుడు వేం కటపతి దేవరాయలు – 2 కాలంలో చంద్రగిరి ప్రాంతాలలో జీవించాడు. పైగా పింగళిసూరన, రామరాజ భూషణుడు, ధూర్జటి వంటివారు శ్రీకృష్ణదేవరాయల తర్వాతి కాలంనాటి వారు. ఈ అంశాల్ని రాయల ఆస్థానంలో కన్నడ తిమ్మ ణార్య కవి, సంస్కృత కవి బండారు లక్ష్మీనారా యణ కవి వంటి వారు వున్నట్లు ప్రస్తావన చేసి వుంటే బాగుండేది.



శ్రీకృష్ణదేవరాయలు ఆలయ నిర్మాణాలను గురించి చరిత్ర రచన ఈమని శివనాగిరెడ్డి వ్యాసం సమగ్రంగా వుంది. అయితే రాయలు ప్రారంభించిన చాలా ఆలయాలు సమగ్రంగా వుండటం విశేషం. విఠల, శ్రీకృష్ణ, ఉగ్ర నర సింహ ఆలయాల్ని పరిశీలిస్తే మనకీ విషయం ద్యోతకమవుతుంది. రాయల అసంపూర్తి నిర్మా ణాలపై అచ్యుతరాయలు దృష్టిపెట్టినట్లే, అచ్యు తుడు ప్రారంభించిన అచ్యుత రామాల యం కూడా అసమగ్రంగానే నిలచిపోయింది. అచ్యు తుని తర్వాత అతని కుమారుని హత్య(బావ మరుదులైన సలికం సోదరుల చేత) ఆ తర్వాత సదాశివరాయల్ని(అచ్యుతుని తమ్ముడు రంగరాయుని కుమారుడు) ముందుంచుకొని రాజ్యాధికారం చేపట్టిన అళియరామరాయలు వీటి నిర్మాణానికి ఉత్సాహం చూపకపోవడం ఇందుకు కారణం కావచ్చు.

చర్విత చర్వణం

ఆ తర్వాత డాక్టర్ ముదివేడు రాయలు తిరు మలునికి చేసిన సేవలు, కొమర్రాజు రాజధాని వర్ణన, విద్వజ్జన పోషణ – రాయల రాజనీతిపై ఖండవల్లి వ్యాసం విషయ ప్రాధాన్యతతోనూ, విజ్ఞానదాయకం గానూ వున్నాయి. సంకలన కర్త అన్నట్లు వ్యాస రచ యితలు అనేకులు కీర్తిశేషులు కావడం, ఉన్నవారు తమ సాహిత్య కృషిని కొనసాగిస్తూ వుండటం వల్ల 'వ్యాసాలు' ఎంపికలో, పరిష్కరణలో సంకలనకర్తకు అధికారం వుండకపోవడం వల్ల సంకలనంలో కొన్ని విషయాలు చర్విత చర్వణంగా వచ్చాయి.

మరికొన్ని వ్యాసాల్లో సమగ్రత కొనసాగింది. అయితే డాక్టర్ వడ్డి విజయసారధి చరిత్ర పరిశోధ కులు కావడం వల్ల చరిత్రకు అందని మరికొన్ని విస్తృత అంశాలను సింహావలోకనం చేస్తూ 'తొలి పలుకులు' రాసి వుంటే వారి ప్రతిభ లోకానికి వెల్లడి కావడంతో పాటు 'పుస్తకం' చరిత్రకే 'కీర్తి చంద్రిక' అయి వుండేది. పునర్ముద్రణలో సంకలనకర్త పై అంశాలను పరిశీలిస్తా రని ఆశిస్తూ శుభాభినందనలు, శుభాకాంక్షలు అంద జేస్తున్నాను.

Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/09-11

● చరిత్ర సృష్టించిన

సకల జనుల సమ్మె!



నెల్లూరు జైన్‌గోల్డ్ షోరూం అధినేత మణిలాల్ జైన్ ఏకైక కుమార్తె సోనాల్, దీపక్‌ల వివాహ నిశ్చితార్థం 2తేది అనిల్ గార్డెన్స్‌లో జరిగింది.

సకల జనుల సమ్మె రాష్ట్ర ప్రజల జీవితాలను దారుణంగా దెబ్బ తీస్తున్నది. ఎన్నో సమ్మెలు చూశాము మనం. ఇంతకంటే తీవ్రమైన ఆందోళనలనూ ఎదుర్కొన్నాము. కానీ సకల జనులసమ్మె వలె సామాన్యుల జీవనాన్ని, దినచర్యను తీన్‌తారు చేసిన ఉద్యమం చరిత్రలో మరొకటి లేదని చెప్పవచ్చు. తెలంగాణలో సమ్మె జరుగుతుంటే సీమాంధ్రలో రవాణా వ్యవస్థ చిన్నాభిన్నమై పోతున్నది. బస్సులు లేవు. రైళ్లు నడవడం లేదు. విమానం టిక్కెట్లు కొండెక్కి కూర్చున్నాయి. మరొకప్రక్క విద్యుత్ సమస్య జనం ప్రాణాలను తోడేస్తున్నది. దాదాపుగా పగటి పూట కరెంట్ లేని దుస్థితి. దానితో పరిశ్రమలు మూత పడుతున్నాయి. లక్షలాది మంది కార్మికులు వీధిన పడుతున్నారు. ప్రభుత్వ రాబడి పతనమై పోతుంది. మరొకపది పదిహేను రోజులు ఇదే ప్రకారం సమ్మె కొనసాగితే, ఖజానా ఖాళీ కావడం ఖాయం. జీతాలు కూడా ఇవ్వలేని దివాలా స్థితికి చేరుకొంటుంది రాష్ట్ర ప్రభుత్వం. ఈ సమ్మెతో రెండు ప్రాంతాల ప్రజలూ విసిగి పోతున్నారు.

సమ్మెకు పూనుకొన్న ప్రభుత్వ ఉద్యోగుల పరిస్థితి కూడా ఏమంత సుకరంగా లేదు. తెలంగాణ వంటి అసాధ్యమైన కోరికతో సమ్మె కట్టడం చాలా పెద్ద సాహసం. ఎంతకాలం దీన్ని కొనసాగించాలో తెలియడం లేదు. అంతకాలం ఉద్యోగుల మీద పట్టు కొనసాగించగల సామర్థ్యం ఉద్యోగ నేతలకు వుందా అన్నది సందేహం. ఒకవేళ పట్టు జారి సమ్మె విచ్ఛిన్నమైతే ఇక జన్మలో తెలంగాణ రాదు. ఆరు నూరైనా నూరు ఆరైనా తెలంగాణ విషయంలో ఒక స్పష్టమైన హామీ వచ్చే వరకు కొనసాగించి తీరాలి.

ఆ పట్టు జారుతుందనే సందేహంతోనే కెసిఆర్ నిరాహార దీక్ష తలంపు ప్రకటించాడు. రెండేళ్ల క్రితం ఆయన దీక్ష చేపట్టినప్పటికి, ఇప్పటికి రాజకీయ పరిస్థితులలో చాలా మార్పులు వచ్చాయి. అప్పట్లో రోశయ్య మెతకతనం వల్ల, కెకె వంటి వారు ఢిల్లీ పెద్దలకు తప్పుడు సమాచారం ఇచ్చి, గందరగోళం సృష్టించడం వల్ల చిదంబరం తొందర పడి తెలంగాణ హామీ ప్రకటన చేశాడు. కానీ ఇప్పుడు అది వీలు కాదు. కెసిఆర్ నిజంగానే దీక్ష చేస్తే మాత్రం తెలంగాణలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించిపోతాయన్నది వాస్తవం. ఉద్యోగుల సమ్మె వల్ల వుడుకు మీద వున్న ఉద్యమం హింసాయుతంగా మారినా ఆశ్చర్యం లేదు. దానివల్ల ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల మధ్య శాశ్వత వైరం ఏర్పడే ప్రమాదం వుంది. ఇప్పటివరకు ఎవరెన్ని చెప్పినా తెలంగాణ ఉద్యమకారులు ఆంధ్రుల విషయంలో సంయమనం పాటిస్తున్నారు. వారి జోలికి వెళ్లే ప్రయత్నమే చేయడం లేదు. కానీ ఒకసారి పరిస్థితి చెయ్యి జారితే, ఆ నిగ్రహం వీలు కాదు. చాలా ప్రమాదకరమైన పరిస్థితి అది.

అయితే కెసిఆర్‌కు దీక్ష చేసే ఆత్మబలం, ఆరోగ్యం వున్నాయా అన్నది ప్రశ్న. గత దీక్షా సమయంలో రోశయ్య ఉదాసీనత వల్ల ఆయన ఆస్పత్రిలో హాయిగా ఆహారం తీసుకొంటూ వ్యవహారం నడిపాడు. మరొకసారి ఆ మోసం చేయడం జరిగే పనికాదు. ప్రజలలో కూడా చాలా నిఘా వుంటుంది. కెసిఆర్ ఆరోగ్యాన్ని బట్టి చూస్తే నాలుగైదు రోజులకు మించి దీక్ష కొనసాగించలేక పోవచ్చు. అంత స్వల్ప వ్యవధిలో విరమిస్తే పరువు పోతుంది. పట్టుబట్టి కొనసాగిస్తే ప్రాణానికే ప్రమాదం. అన్నా హజారే వలె ఎన్ని రోజులైనా నిరాహారంగా వుండగల శారీరక శక్తి కెసిఆర్‌కు లేదు. అందువల్లనే ఆయన తన దీక్ష ఆలోచన మీద ఒకటికి పదిసార్లు పునరాలోచన చేస్తున్నాడు.

మరొకప్రక్క తెలంగాణ కాంగ్రెస్ నేతల పరిస్థితి దయనీయంగా వుంది. అధిష్టానం తెలంగాణ ఇచ్చే పరిస్థితిలో లేదని అర్థమైపోవడంతో వారి జవసత్వాలు వుడిగిపోయాయి. తెలంగాణ రాకుంటే, ఆ నేర భారం మొత్తం కాంగ్రెస్ పార్టీ మోయక తప్పదు. దాని ఫలితం తీవ్రంగా వుంటుంది. రేపటి ఎన్నికలలో కాంగ్రెస్‌కు ఓటు పడదు. తమ రాజకీయ భవిష్యత్తు అంధకారంలో పడిపోతుందన్న భీతితో మనోవేదనకు గురౌతున్నారు. రేపటి ఎన్నికలలో టిక్కెట్ ఇస్తానన్నా తీసుకోవడానికి ఏ కాంగ్రెస్ నేత కూడా ముందుకు రాలేని దౌర్భాగ్యం దాపురించబోతున్నది. కాంగ్రెస్‌వాది అన్న ప్రతివాడినీ తెలంగాణ ద్రోహిగా చూసే ప్రమాదం కళ్ల ముందు కన్పిస్తున్నది.

తెలుగుదేశం పరిస్థితి కూడా ఇంచుమించు అదే. అయితే తెలంగాణ ఇవ్వాల్సిన బాధ్యత స్థానంలో ఆ పార్టీ లేదు కాబట్టి కొంత నయం. ఎర్రబెల్లి దయాకర్‌రావు, కడియం శ్రీహరి, దేవేంద్ర గౌడ్ వంటివారు తెలంగాణ ఉద్యమంలో తమ వంతు పాత్ర పోషించడం ద్వారా నెపం తమ మీదకు రాకుండా జాగ్రత్తపడాలని చూస్తున్నారు. కానీ జనం మాత్రం కాంగ్రెస్‌ను చూసే కళ్లతోనే తెలుగుదేశాన్ని కూడా చూస్తున్నారు.

మొత్తానికి తెలంగాణ ప్రాంతంలో రాజకీయ పరిస్థితులు గందరగోళంగా వున్నాయి. ఎవరికీ మనఃశాంతి లేదు.

సెక్రటరియేట్‌లో క్లియరెన్స్ సేల్

దసరా దీపావళి వంటి పండగలకు చందన, బొమ్మన వంటి వ్యాపార సంస్థలు డిస్కౌంట్ సేల్స్, బంపర్ ఆఫర్లు ప్రకటిస్తూ వుంటాయి. కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి భలే మంచి చౌక బేరమని ప్రకటిస్తూ వుంటాయి. రాష్ట్ర ప్రభుత్వాన్ని నడిపే మంత్రులు, ఐఎఎస్ అధికారులు ఇప్పుడదే వ్యాపార సూత్రాన్ని పాటిస్తున్నారు. తెలంగాణ ఉద్యమ ఒత్తిడి ఫలితంగా ప్రభుత్వ వునికి అనుమానంలో పడింది. తుమ్మితే వూడే ముక్కు వలె మారింది. రేపు వుంటుందో లేదో తెలియని అయోమయం. దానితో దీపం వుండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలనే తీర్మానానికి వచ్చేశారు మంత్రులు, అధికారులు. పైసలు రాలే ఫైళ్ల వెతుకులాటలో పడ్డారు. దబ్బిస్తే చాలు ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ పెట్టడానికి సిద్ధమౌతున్నారు. ఒకరకంగా చెప్పాలంటే, సెక్రటేరియట్‌లో క్లియరెన్స్ సేల్ వంటి వ్యవహారం నడుస్తున్నది ప్పుడు. రాజీనామాలు చేసిన తెలంగాణ మంత్రుల కైతే మరీ తొందరగా వుంది. కెసిఆర్ ఎప్పుడు తమ మెడ మీద కత్తి పెడతాడో, రాజీనామాలు ఆమోదించుకోమని తొందర పెడతాడో అనే భయంతో, సాధ్యమైనంత త్వరగా నాలుగు రూకలు రాలే ఫైళ్లను పరిష్కరించే పనిలో నిమగ్నమై వున్నారు.



Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore. E-mail : jaminryot@yahoo.com